




మత్స్యావతారంలో జగన్నాథుడు

రథోత్సవాల సందర్భంగా టర్నర్ చౌల్ట్రీలో కొలువుదీరిన జగన్నాథుడు తొలిరోజు సోమవారం మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి అర్చకులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వామిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులుతీరారు. కాగా మంగళవారం జగన్నాథస్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. - పూర్ణామార్కెట్

11న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక?



విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 11వ తేదీన నగరానికి రానున్నట్టు తెలిసింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా విశాఖ వస్తున్న ఆయన మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించి నిపుణులు, ఉద్యోగులు, సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం అనకాపల్లి కూడా వెళ్లే అవకాశం ఉందంటున్నారు. అయితే సీఎం పర్యటనను ఇంకా అధికారులు ధ్రువీకరించలేదు.

విశాఖ రీజియన్‌కు కొత్త బస్సులు

- నెలాఖరులోగా 33 సూపర్ లగ్జరీ సర్వీసులు
- దూర ప్రాంతాలకు నడపాలని అధికారుల నిర్ణయం



ద్వారకా బస్‌స్టేషన్, జూలై 8: ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు కొత్తగా 33 సూపర్ లగ్జరీ సర్వీసులు వస్తున్నాయి. దఫదఫాలుగా ఈ నెలాఖరు నాటికి ఈ బస్సులు విశాఖ రానున్నాయి. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుతీరిన తరువాత కొత్తబస్సుల రాక పెరిగింది. కాలం చెల్లిన బస్సుల సంఖ్య పెరిగిపోతున్నదని, వాటి స్థానంలో కొత్తబస్సులు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని రెండేళ్లుగా ప్రభుత్వాన్ని విశాఖ రీజియన్ అధికారులు కోరుతూ వస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం విశాఖ రీజియన్‌కు 45 కొత్తబస్సులు మంజూరు చేసినట్టు ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తబస్సులు రావడంలో వేగం పెరిగింది. ఇప్పటివరకు ఒక అల్ట్రా డీలక్స్, 11 సూపర్

... మిగతా 4వ పేజీలో

ఇసుక డిపోలపై తర్జనభర్జన

జిల్లాలో రీచ్‌లు లేకపోవడంతో ఇటు శ్రీకాకుళం, అటు రాజమండ్రి నుంచి తెచ్చుకోవలసిన పరిస్థితి

- అందుకోసం డిపోలు ఏర్పాటు
- అగనంపూడి, భీమిలిల్లో ఇప్పటికీ కొనసాగింపు
- ప్రస్తుతం అక్కడి నుంచే సరఫరా
- రానున్న రోజుల్లో నిర్వహణపై స్పష్టత కరవు
- ఒక్కో డిపోకు 20 మంది సిబ్బంది అవసరం


భీమిలి ఇసుక డిపో వద్ద అమ్మకాలు ప్రారంభించిన ఆర్డీవో భాస్కరరెడ్డి, జిల్లా గనుల శాఖ అధికారి రాజు తదితరులు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధికంగా ఇసుక వినియోగించే నగరం విశాఖపట్నం. అటువంటిచోట స్థానికంగా ఇసుక లభ్యమయ్యే పరిస్థితి లేదు. పొరుగు జిల్లాల నుంచి తీసుకురావల్సిందే. అయితే ఉచితంగా ఇసుక సరఫరాకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ దూరంగా ఉన్న గోదావరి, వంశధార, నాగావళి నదుల నుంచి ఇసుక విశాఖ తీసుకువచ్చి ప్రజలకు ఉచితంగా సరఫరా సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో అక్కడ నుంచి తీసుకువచ్చిన ఇసుకను ప్రజలకు సరసమైన ధర (రవాణా వ్యయం, పన్నులు)కు విక్రయించేందుకు డిపోలు అవసరం. ప్రస్తుతం జిల్లాలో రెండు డిపోలు ఉన్నా వాటిని నిర్వహించే యంత్రాంగం లేదు. ఈ పరిస్థితుల్లో డిపోలు నిర్వహణ ఎలాగో అధికారులకు అర్థం కావడం లేదు.

గత ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో దశల వారీగా ఎనిమిది డిపోలు ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా ఇసుక అమ్మకాలు జరిపారు. అయితే మధ్యలో డిపోల నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో ఇసుక సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఇసుక తవ్వకాల కాంట్రాక్టు తీసుకున్న సంస్థలు, గనుల శాఖ మధ్య సమన్వయం లేకపోవడంతో చిన్నపాటి నిర్మాణదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. బల్క్‌గా ఇసుక కావాలనుకునే బిల్డర్లు, పెద్ద కాంట్రాక్టర్లు గోదావరి, వంశధార, నాగావళి నదుల్లో రీచ్‌లకు వెళ్లాల్సి వచ్చింది. తక్కువ మొత్తం అవసరమైనవారు నగరంలో ప్రైవేటు వ్యాపారుల వద్దకు వెళ్లి ఎక్కువ మొత్తం చెల్లించి కొనుగోలు చేశారు. ఇదే సమయంలో కొందరు వ్యాపారులు ఒడిశా నుంచి ఇసుక తెచ్చి నగరంలో టన్ను రూ.1,200 నుంచి రూ.1,400 వరకు అమ్మకాలు జరిపారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఇసుక

... మిగతా 4వ పేజీలో

భీమిలి డిపోలో ఇసుక సరఫరా ప్రారంభం

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భీమిలి డిపో నుంచి సోమవారం ఇసుక సరఫరాను ఆర్డీవో భాస్కరరెడ్డి, జిల్లా గనుల శాఖ అధికారి డీఈఎస్ఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుకను వంశధార నది నుంచి భీమిలి డిపోకు తీసుకువచ్చారు. అందుకే సీనరేజ్, ఇతర పన్నులు, రవాణా ఖర్చులు కలిపి టన్నుకు రూ.758 వసూలు చేస్తున్నారు. తొలి రోజు 20 టన్నులు విక్రయించారు. ఇకపై ప్రతిరోజు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఇసుక అమ్మకాలు కొనసాగించనున్నారు. గోదావరి నది నుంచి ఇసుక తీసుకురావడంతో అగనంపూడి డిపో వద్ద టన్ను రూ.1394కు అందిస్తున్నారు. ప్రస్తుతం అగనంపూడి డిపోలో 97,782.36 టన్నులు, భీమిలిలో 94,047 టన్నులు...మొత్తం 1,91,826.36 టన్నులు ఇసుక అందుబాటులో ఉంది.

అగనంపూడి డిపోలో ఏర్పాట్లు


డిపోలో ఇసుకను లోడింగ్ చేసేందుకు సిద్ధం చేసిన ఎక్స్‌కవేటర్

అగనంపూడి, జూలై 8: అగనంపూడి డిపో నుంచి ఇసుక సరఫరాకు సోమవారం అధికారులు ఏర్పాట్లుచేశారు. రీచ్‌లలో లోడింగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీలతో పాటు డిపోల వద్ద అన్‌లోడింగ్, లోడింగ్ చార్జీలు, పన్నులతో కలిపి టన్ను ఇసుక ధర రూ.1,394గా నిర్ణయించారు. రోజుకొక వ్యక్తికి 20 టన్నుల ఇసుక మాత్రమే సరఫరా చేయనున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపితే ఇసుక సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. కాగా తొలిరోజు ఎవరూ ఇసుక తీసుకువెళ్లలేదని డిప్యూటీ తహసీల్దార్, ఇసుక డిపో ఇన్‌చార్జి అశోక్ తెలిపారు.

పోస్టింగ్‌కు పైరవీలు

వీఎంఆర్‌డీఏ సెక్రటరీ పోస్టుకు తీవ్రమైన పోటీ

- మంత్రుల నుంచి కొంతమంది సిఫారసు లేఖలు
- ఎనిమిది నెలల క్రితం ఆ పోస్టులోకి వచ్చిన డిప్యూటీ కలెక్టర్ దాట్ల కీర్తి
- తనను మరికొంతకాలం కొనసాగించాలని వినతి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో సెక్రటరీ పోస్టుకు తీవ్రమైన పోటీ ఏర్పడింది. డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన దాట్ల కీర్తి ప్రస్తుతం సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆమె ఇక్కడకు వచ్చి కేవలం ఎనిమిది నెలలే అయింది. ఆమెను తప్పించి ఆ సీట్లోకి వెళ్లాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. గత రెండేళ్లు జిల్లా కలెక్టరే వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించడంతో ఇక్కడ పరిపాలనాపరమైన అంశాలన్నీ సెక్రటరీయే చూడాల్సి వచ్చింది. కీర్తికి ముందు సెక్రటరీలుగా పనిచేసిన రంగయ్య, వేణుగోపాల్ సంస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించి సఫలమయ్యారు. రంగయ్య కొంత మెతకగా ఉన్నా వేణుగోపాల్ రికార్డులను సక్రమంగా భద్రపరచడం నుంచి అర్హతలు కలిగిన వారికి సీనియారిటీ మేరకు బాధ్యతల అప్పగింత, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల కఠిన వైఖరి వంటి చర్యలు చేపట్టి ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహించేలా చేశారు. ఆ సంస్కృతిని కీర్తి కొనసాగించారు. ముఖ్యమైన అంశాలను కమిషనర్ దృష్టికి సకాలంలో తీసుకువెళ్లి అర్హులైన వారికి పదోన్నతులు కల్పించారు. వేలెత్తి చూపించే అవకాశం లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. కొత్త ప్రభుత్వం రావడంతో చాలామంది విశాఖపట్నం రావాలని, వీఎంఆర్‌డీఏలో ఏదో ఒక పోస్టులో చేరాలని యత్నిస్తున్నారు. ఈ క్రమంలో సెక్రటరీ పోస్టుపై దృష్టిసారించారు. అందులో మహిళలే ఉండడం గమనార్హం. ఒకప్పుడు వీఎంఆర్‌డీఏలో భూసేకరణ విభాగంలో తహసీల్దార్‌గా పనిచేసి ఆపై డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం జిల్లాలోని పర్యాటక శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కూడా సెక్రటరీ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. వీఎంఆర్‌డీఏలోనే చీఫ్ అకౌంట్స్ అధికారిణిగా పనిచేసి కమిషనర్ ఆదేశాలతో మాతృ శాఖకు వెళ్లి ఇప్పుడు ఏపీ గురుకులాల సొసైటీ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అధికారిణి కూడా సెక్రటరీ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఇటీవలె ఉమ్మడి విశాఖ జిల్లా మంత్రి నుంచి సిఫారసు లెటర్ తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. కీర్తిని మార్చాల్సి వస్తే తనకు అవకాశం కల్పించాలని గతంలో వీఎంఆర్‌డీఏలోనే పనిచేసిన అధికారి అమరావతి ఉన్నతాధికారులను కోరినట్టు తెలిసింది. ఇదిలావుండగా సెక్రటరీ కీర్తి కూడా తాను వచ్చి కేవలం ఎనిమిది నెలలే అయినందున కొంతకాలం కొనసాగించాలని కోరుతున్నట్టు వీఎంఆర్‌డీఏ వర్గాల సమాచారం. ఈ మేరకు ఆమె కూడా ఉమ్మడి జిల్లాలో కీలక పదవి పొందిన నాయకుడి సహకారం కోరినట్టు తెలిసింది. రేసులో ఉన్న వారిలో కొందరు రెబల్స్‌గా

... మిగతా 4వ పేజీలో

కొళాయి నీరు కలుషితం!



కేఆర్ఎం కాలనీలో పది రోజులుగా మురికినీరు రాక

- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- మూడు సీసాల్లో నీటిని పట్టుకుని జీవీఎంసీకి వెళ్లి ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన యువకుడు
- తక్షణం చర్యలు తీసుకోవాలని నీటి సరఫరా విభాగం అధికారులకు అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తాగునీరు కలుషితమవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా పలుప్రాంతాల్లో డయేరియా ప్రబలుతోంది. విజయవాడ, గుంటూరు, కాకినాడల్లో కలుషిత నీటిని తాగి కొందరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. నగరంలో కూడా నీటి కాలుష్యం జరిగే ప్రమాదం ఉందని 'ఆంధ్రజ్యోతి'లో ఫొటోలతో సహా పలు మార్లు కథనాలు ప్రచురించింది. కానీ జీవీఎంసీ అధికారులు మాత్రం... అబ్బే అలాంటి పరిస్థితి లేదంటూ బుకాయించారు. అయితే కేఆర్ఎం కాలనీలో గత పది రోజులుగా కొళాయిల నుంచి మురికినీరు వస్తోందంటూ సోమవారం జీవీఎంసీలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకరు ఫిర్యాదు చేశారు. కలుషిత నీటిని బాటిల్‌లో తీసుకువచ్చి అధికారులకు అందజేశారు.


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొళాయి నుంచి వచ్చిన కలుషిత నీరుని అదనపు కమిషనర్‌కు చూపిస్తున్న శివకుమార్

జీవీఎంసీ పరిధిలో సుమారు 3.2 లక్షల కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. నీటి సరఫరా చార్జీల రూపంలో నగర పాలక సంస్థకు ఏటా రూ.260 కోట్లు వరకూ ఆదాయం సమకూరుతుంది. విద్యుత్ బిల్లులు చెల్లింపు, సిబ్బంది వేతనాలకు రూ.వంద కోట్లు, పైప్‌లైన్ల రిపేర్లు, కొత్త పరికరాల కొనుగోలు, నిర్వహణ కోసం మరో రూ.60 కోట్లు ఖర్చవుతుందని అధికారులు చెబుతుంటారు. దీనినిబట్టి నిర్వహణ ఖర్చులు పోగా నీటి సరఫరా ద్వారానే జీవీఎంసీకి ఏటా రూ.వంద కోట్లు వరకూ ఆదాయం సమకూరుతుంది. అయితే ఆదాయం సమకూర్చుకోవడంపై చూపుతున్న శ్రద్ధ... నీటిని ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేయడంపై చూపడం లేదనే విమర్శలు


... మిగతా 4వ పేజీలో

ఖాకీ అక్రమాలపై విచారణ

- స్పెషల్ బ్రాంచి అధికారులకు నగర పోలీస్ కమిషనర్ ఆదేశం
- తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని నివేదిక ఇవ్వాల్సిందిగా సదరు అధికారి వేడుకోలు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో ఒక సబ్ డివిజన్ అధికారి అక్రమాలపై 'ఖాకీ వసూల్' శీర్షికన ఈనెల ఐదో తేదీన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సమగ్ర విచారణ చేపట్టాల్సిందిగా స్పెషల్‌బ్రాంచి అధికారులను సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. సంబంధిత అధికారుల విచారణలో ఆరోపణలన్నీ వాస్తవమేనని తేలినట్టు తెలిసింది. వాటితోపాటు కేజీహెచ్‌లో ఇటీవల జరిగిన కేసులో కూడా భారీగానే వసూలు చేసినట్టు విచారణ సందర్భంగా గుర్తించినట్టు సమాచారం. వీటన్నింటి ప్రకారం సీపీకి నివేదిక ఇచ్చేందుకు స్పెషల్‌బ్రాంచిలోని అధికారులు సన్నద్ధం కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి అప్రమత్తమయ్యారు. స్పెషల్‌బ్రాంచిలో తనకు సన్నిహితంగా ఉండే ఒక అధికారికి ఫోన్ చేసి తనపై పత్రికలో వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవమేనని, గిట్టని కొంతమంది కావాలనే బురదజల్లే ప్రయత్నం చేశారని సీపీకి నివేదించాలని కోరారు. నివేదికను ఎలా పంపించాలో తన కార్యాలయం నుంచే టైప్ చేసి స్పెషల్‌బ్రాంచిలోని అధికారికి పంపించినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. అయితే వివాదాస్పద అధికారిగా గుర్తింపు కలిగిన సదరు సబ్‌డివిజనల్ అధికారి చెప్పినట్టు నివేదిక ఇస్తే సీపీ ఆగ్రహానికి గురయ్యే ప్రమాదం ఉందని, అలాగని ఉన్నది ఉన్నట్టు నివేదిక పంపించేస్తే అతను ఇబ్బందుల్లో పడడం ఖాయం కాబట్టి ఏం చేయాలో తెలియని స్థితిలో స్పెషల్‌బ్రాంచిలోని ఆ అధికారి సతమతమవుతున్నట్టు సిబ్బంది ద్వారా తెలిసింది.

మూడు విమాన సర్వీసులు రద్దు



గోపాలపట్నం, జూలై 8: విశాఖ వచ్చి వెళ్లాల్సిన మూడు విమాన సర్వీసులను సోమవారం వేర్వేరు కారణాల వల్ల రద్దు చేసినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు. బెంగళూరు నుంచి విశాఖ వచ్చి వెళ్లాల్సిన విమానాన్ని సాంకేతిక సమస్య కారణంగా రద్దు చేశారు. అదే విధంగా ముంబై, జైపూర్‌ల నుంచి వచ్చి వెళ్లాల్సిన విమానాలను ప్రతికూల వాతావరణం కారణంగా రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

మాజీలైనా అదే డాబు!

- వాహనాలకు ఎమ్మెల్యే స్టిక్కర్ తొలగించని మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి, తిప్పల నాగిరెడ్డి

వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డిలు మాజీలైనా ఇప్పటికీ ఎమ్మెల్యే స్టిక్కర్ కలిగిన వాహనాల్లోనే తిరుగుతుండడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. వారిద్దరూ మే 13వ తేదీతో మాజీలైపోయారు. కానీ ఆ విషయాన్ని మరిచిపోయినట్టున్నారు. తమ కార్లపై ఎమ్మెల్యే స్టిక్కర్లను ఇప్పటికీ తొలగించలేదు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం బీచ్‌రోడ్డులో జరిగిన కార్యక్రమానికి వారిద్దరూ హాజరయ్యారు. ఆ సమయంలో ఇద్దరి కార్లపైనా ఎమ్మెల్యే స్టిక్కర్లు ఉండడం చూసిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే దీనిపై చర్చించుకోవడం కనిపించింది. - ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం



ఎమ్మెల్యే స్టిక్కర్ కలిగిన వాహనంతో వాసుపల్లి



ఎమ్మెల్యే స్టిక్కర్ వున్న తిప్పల నాగిరెడ్డి వాహనం

కలెక్టర్‌ను కలిసిన గండి బాబ్జీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న బాబ్జీ

విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి: కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను తెలుగుదేశం విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండిబాబ్జీ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మాధవధార, జూలై 8 ; మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను గ్రేటరు 51 వవార్డులో ఘనంగా జరిపారు. కార్పొరేటరు ఆర్.వెంకటరమణ వై.ఎస్. చిత్రపటానికి పూలమాలలువేసి నివాళలర్పించారు.ఆయన చేసిన ప్రగతిని వివరించారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు, మహిళలు, కార్యకర్తలున్నారు.


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు,

అక్కయ్యపాలెం, జూలై 8 : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన ముఖ్యమం త్రిగా చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు కేక్ తినిపించారు.

ఆగస్టు 5 నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

» మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, జూలై 8: విజయవాడ స్టేషన్ వద్ద మూడో లైను నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు విశాఖ - తిరుపతి /కడప ఎక్స్‌ప్రెస్ (17488), ఆగస్టు ఆరు నుంచి 11వ తేదీ వరకు కడప /తిరుపతి- విశాఖ ఎక్స్‌ప్రెస్ (17487)లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), విశాఖ- లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), భువనేశ్వర్-ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), షాలిమార్- హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727); ఆగస్టు 5 నుంచి 9 వరకు విశాఖ- నిజాముద్దీన్ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ (12803); ఆగస్టు 8న విశాఖ- సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503), టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్ ప్రెస్ (18111), విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (20803) రైళ్లు వయా గుణదల, రాయనపాడు మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయి. ఆగస్టు 2 నుంచి 10 వరకు సికింద్రాబాద్ - విశాఖ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), ముంబాయి- భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), సాయినగర్ షిర్డీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18504), లోకమాన్య తిలక్-విశాఖ ఎల్ టీటీ ఎక్స్‌ప్రెస్ (18520); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్- విశాఖ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046) ; ఆగస్టు 4, 7న నిజాముద్దీన్- విశాఖ స్వర్ణజయంతిఎక్స్‌ప్రెస్ (12804); ఆగస్టు 4న గాంధీధాం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20804), ఆగస్టు 7న ఓకా-పూరి ఎక్స్‌ప్రెస్ (20820) రైళ్లు వయా రాయనపాడు, గుణదల మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయి. ఈ రైళ్లకు రాయలపాడులో హాల్ట్ కల్పించారు.

చదువుతోనే భవిష్యత్తు

డాబాగార్డెన్స్, జూలై 8: చదువు ద్వారానే భవిష్యత్తు సాధ్యమని ఎంపీడీవోలు బి.పైడపునాయుడు, బి.పుష్యరాగం పిలుపునిచ్చారు. సోమవారం జీవీఎంసీ మోడల్ ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లోని ర్యాలీలు నిర్వహించారు. నేను బడికిపోతా.. ద్వారా పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కనకమహాలక్ష్మి, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, సీఆర్‌పీలు పాల్గొన్నారన్నారు.


ర్యాలీలో ఎంపీడీవోలు పైడపునాయుడు, పుష్యరాగం

కేంద్రీయ విద్యాలయాల్లో క్రీడా పోటీలు ప్రారంభం

కంచరపాలెం, జూలై 8 : స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో సోమవారం రీజియన్ స్థాయిలో బాలికల హ్యాండ్‌బాల్ పోటీలను ప్రిన్సిపాల్ జి. కిశోర్, శ్రీరతన్ దీప్ షోరయస్ సోమవారం ప్రారంభించారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని అండర్-14 విభాగం నుంచి 114 మంది బాలికలు, అండర్-17 విభాగంలో 14 మంది బాలికలు ఎనిమిది పాఠశాలల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి కెప్టెన్ శ్రీ రతన్‌దీప్ షోరయస్ మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ జి.కిశోర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన బాలికలు హైదరాబాద్ రీజియన్ తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మదీనా మాలిక్, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.


బాస్కెట్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

అక్కయ్యపాలెం : గ్రేటర్ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో సోమవారం పీటీ మాస్టార్ రియాజ్ ఖాన్, ప్రిన్సిపల్ కమల్‌జిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డీఆర్ఎం పరిచయం చేసుకున్నారు. ఈ పోటీల్లో అండర్-14, అండర్ 17 బాలురు పాల్గొన్నారు. అండర్ -14లో మూడు పాఠశాలలు పాల్గొన్నాయి. అండర్-17లో ఆరు పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీలు మంగళవారం కూడా జరుగుతాయి. విజేతలకు ఈకో రైల్వే ఏడీఆర్ఎం సుధీర్ గుప్తా బహుమతులు ప్రదానం చేయనున్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న కెప్టెన్ శ్రీరతన్ దీప్,ప్రిన్సిపాల్ కిశోర్

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

మర్రిపాలెం: హైదరాబాద్ రీజియన్ పరిధిలోగల కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులకు 104 ఏరియాలోని కేంద్రీయ విద్యాలయం-2 హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం ప్రిన్స్‌పాల్ సీహెచ్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్నేహం, ఐకమత్యం, పోటీతత్వం పెంపొందేంచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్స్‌పాల్ శ్రీనివాసులు

డ్రైనేజీలో పూడికలు తొలగింపు

అక్కయ్యపాలెం, జూలై 8 : గ్రేటర్ 42వ వార్డులో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న డ్రైనేజీ పునర్నిర్మాణ పనులతో మురుగు నీరు రహదారిపైకి చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో టీడీపీ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి , జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు. ఏఎంహెచ్‌వో సునీల్ కుమార్ సోమవారం ఉదయం పారిశుధ్య సిబ్బందిని పంపించి డ్రైనేజీల్లోని చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించారు. రోడ్డుపై మురుగునీటిని కాలువల్లోకి మళ్లించారు. ఈ పనుల పర్యవేక్షణలో జీవీఎంసీ ఎస్ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొర, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ ఉన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ


విజేతలతో రైల్వే స్పోర్ట్సు కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 8: జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కేశవరావు స్మారక జిల్లా స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి వాల్తేరు స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి మురళీపాత్రో, వీఎస్ఎన్.మూర్తి, అచ్యుత్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: బాలుర అండర్-9 విభాగంలో అన్వర్, దన్విత్, దియాంశ్; అండర్-11 కేటగిరిలో ఆర్యన్ గోపాల్, హస్విక్, వరుణ్ కృష్ణ ప్రథమ, ద్వి తీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. అభిషేక్ పాల్; అండర్-13 విభాగంలో ఎంఎస్. బాలాజీ, మోక్షజ్ఞ తేజ, ఎస్.హర్షిత్, ఎస్.కె. క్వాజా సుల్తాన్; అండర్-15లో లిఖిత్‌మోహన్, జాషువా, సాయిచరణ్, జాన్ వెస్లీ; అండర్-17లో ఎస్.కె. రబ్బాని, అభిరామ్, కౌశిక్, కార్తీక్ గెలుపొందారు. సీనియర్ పురుషుల విభాగంలో రవివర్మ, సెంథిల్ నాథన్, రోహిత్, కె.కార్తీక్; బాలికల అండర్-9లో ఎస్.శ్రీయానిక, కె. ఆరోధ్య, ఈష, ధన్వి; అండర్-11లో వి.పూజిత, మోహితాక్షిత, జశ్మిత, షలాని విజేతలుగా నిలిచారు. అండర్-13లో టి.సన్విక, ఎస్.సెవితాశ్రీ, ధృతికిరణ్, షర్మిల; అండర్-15లో ఎస్.కె.ఆరిఫా సుల్తాన్, కె.రేణుక సత్య, రితీషా, నిత్య; అండర్-17లో టి.సాహితీ రాజ్, పి.మోహిత, జశ్మిత, అశ్రిత; సీనియర్ మహిళల కేటగిరిలో డి.దీక్షిత, ఎస్‌కే.రజ్వాన్, ఎం. దార్మికశ్రీ, దర్శిక వరుసగా విజేతలుగా నిలిచారు.

కెమికల్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేవీ రమణ, తల్లిదండ్రులు

కంచరపాలెం, జూలై 8 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లొమా చదువుచున్న విద్యార్థులకు ప్రగతి మెరిట్ పురస్కారాలు లభించాయి. బాలికలను పోత్సహించాలనే ఉద్దేశంతో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ వారు పదో తరగతితో పాటు పాలీసెట్‌లో ర్యాంకు సాధించిన మెరిట్‌ను ఆధారంగా ఈ స్కాలర్‌షిప్పులు ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ డిప్లొమ చేస్తున్న ఎం.స్నేహారిక, కె.చాందిని, వై.లక్ష్మి, బి.రోహిత, కె.దేవ్న, బి.రాజ్యశ్రీ (పెట్రో కెమికల్స్),పి.స్వర్ణలత (ఆయిల్ టెక్నాలజీ) తదితరులకు ఈ స్కాలర్‌షిప్పులు లభించాయి.ఈ మేరకు బాలికలను తల్లిదండ్రులు సమక్షంలో ప్రిన్సిపాల్ అభినందించారు. వీరికి మూడేళ్ల పాటు ఈ నగదు ప్రోత్సాహకాలు అందనున్నాయి. అధ్యాపకులు డా.బీవీ. లక్ష్మణరావు, సీహెచ్. జయప్రకాశ్ రెడ్డి, డి.దామోదర్, డా.ప్రశాంత కుమారి, డా.పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పార్కులో వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ


ట్రాక్ ప్రారంభిస్తున్న వైశాఖీ స్పోర్ట్సు పార్కు, సభ్యులు

మురళీనగర్, జులై 8 ; మురళీనగర్‌లోని వైశాఖీ స్పోర్ట్సు పార్కులో నవీకరణ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఉదయం, సాయంత్రం వ్యాయామానికి వచ్చే వాకర్స్‌కి సరికొత్త వాకింగ్ ట్రాకుని అందుబాటులోకి తెచ్చారు. రెండెకరాల సువిశాల పార్కులో చుట్టూ వాకింగ్ ట్రాక్‌లో గోతులను పూడ్చి, ఎర్రమట్టి నింపి నడకదారులకు అనువుగా సిద్ధం చేశారు. ఈ కొత్త ట్రాక్‌ని సోమవారం పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్కు కమిటీ కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఉపాధ్యక్షులు పల్లా.చంద్రమౌళి సభ్యులు ఉన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

జగదాంబ కూడలి, జూలై 8: వన్‌టౌన్ వాచ్‌హౌస్ నుంచి పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీవీ ఎంసీ, ట్రాఫిక్ పోలీసు యం త్రాంగం కఠిన చర్యలకు దిగారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద జగన్నాథ రథయాత్ర నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్ర మించి వ్యాపారాలను ట్రాఫిక్ పోలీసులు మూడురోజులుగా తొలగిస్తున్నారు. ఇక నుంచి ఎట్టిపరిస్థితుల్లో ఆక్రమణలను అనుమతించేదిలేదని జీవీ ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఆదేశించారు. దీంతో శని, ఆదివారాలు ఫుట్‌పాత్ వ్యాపారాలు పూర్తిగా మూతబడ్డాయి. అయితే, సోమవారం ఉదయం మళ్లీ దుకాణాలు వెలిశాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది, జీవీఎంసీ-4 సచివాలయం సిబ్బంది రంగంలోకి దిగి ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగించారు. రథయాత్ర మహోత్సవాలకు భక్తులు రాక నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఖాళీ చేయించారు.


ఆక్రమణల తొలగింపులో సీఐ రేవతమ్మ, సచివాలయ సిబ్బంది

ఇసుక డిపోలపై తర్జనభర్జన

... 3వ పేజీ తరువాయి

విధానంపై కీలక నిర్ణయం తీసుకుని ఉచితంగా సరఫరా ప్రారంభించారు. దీని ప్రకారం రీచ్‌ల వద్ద అయితే ఒకరికి రోజుకు ఉచితంగా 20 టన్నుల ఇసుక సరఫరా చేస్తారు. అయితే పలు రకాల పన్నుల కింద టన్నుకు రూ.260 చెల్లించాల్సి ఉంటుంది. రీచ్‌లు ఉన్న జిల్లాల్లో నిర్మాణదారులకు ఇబ్బంది ఉండదు. సమస్య అంతా విశాఖ జిల్లాలోనే. ఇటు గోదావరి, అటు వంశధార, నాగావళి నదుల నుంచి ఇసుక విశాఖ జిల్లాకు తీసుకువచ్చి నిర్ణీత ధరకు విక్రయించాలంటే డిపోలు కొనసాగించాలి. ప్రస్తుతం జిల్లాలో అగనంపూడి, భీమిలి డిపోల్లో గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు తీసుకువచ్చిన 1.9 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. అది రెండు, మూడు నెలల వరకు సరిపోతుందని అంచనా వేస్తున్నారు. టన్ను ఇసుక అగనంపూడిలో రూ.1,394, భీమిలిలో రూ.758కు సోమవారం నుంచి విక్రయాలు ప్రారంభించారు. ఆ ఇసుక విక్రయించిన తరువాత డిపోలు కొనసాగిస్తారా?, లేదా?...అన్నది ఇంకా తెలియడం లేదు. రెండు డిపోలు నిర్వహించాలంటే ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి. ఒక డిపో నిర్వహించాలంటే కనీసం 20 మంది సిబ్బంది ఉండాలి. గోదావరి, వంశధార, నాగావళి నదుల్లోని రీచ్‌ల వద్ద కూడా కొంతమంది సిబ్బంది ఉండాలి. అయితే ఏపీఎండీసీ వద్ద అంత సిబ్బంది లేరు. జిల్లా గనుల శాఖలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. వీరంతా రెగ్యులర్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. పోనీ గ్రామ/వార్డు సచివాలయం సిబ్బంది ద్వారా డిపోల నిర్వహణ, రవాణా తదితర విధులు చేపట్టాలన్నా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవాలి. ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేసి కొంతమంది సిబ్బందిని నియమించుకుని వారి ద్వారా ఇసుక రవాణా, డిపోల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ చేయవచ్చు. చిన్న చిన్న అవసరాలకు ఇసుక కావాలనుకునే వారంతా రీచ్‌లకు వెళ్లి తెచ్చుకోవడం సాధ్యం కాదని, అందువల్ల విశాఖ జిల్లాలో డిపోలు కొనసాగించడం అవసరమని సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అందుకు రెండు, మూడు నెలలు పట్టవచ్చునన్నారు.

ప్రైవేటుగా అమ్మకాలు నిషేధం

ఇదిలావుండగా ఉచిత ఇసుక విధానం అమలు నేపథ్యంలో నగరం, పరిసరాల్లో ప్రైవేటుగా ఇసుక అమ్మకాలు నిషేధించారు. అనధికారికంగా ఇసుక విక్రయిస్తే భారీగా జరిమానా విధిస్తారు.

రేటు తగ్గే అవకాశం?

ప్రస్తుతం అగనంపూడిలో ఇసుక టన్ను రూ.1,394, భీమిలిలో రూ.758గా నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో రీచ్‌ల వద్ద టన్నుకు రూ.475 చెల్లించి నగరానికి కాంట్రాక్టర్లు ఇసుక తీసుకువచ్చారు. అక్కడ పన్నులు, రవాణా ఖర్చులు పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ధర నిర్ణయించామని అధికారులు వివరించారు. డిపోల్లో అందుబాటులో ఉన్న ఇసుక అమ్మకాలు తరువాత ధర కొంత వరకు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. టన్నుకు రూ.200 వరకు తగ్గే అవకాశం ఉందని, అయితే దీనిపై మరింత స్పష్టత రావల్సి ఉందన్నారు.

విశాఖ రీజియన్‌కు కొత్త బస్సులు

... 3వ పేజీ తరువాయి

లగ్జరీ సర్వీసులు వచ్చాయి. మరో 33 సూపర్ లగ్జరీ సర్వీసులు రావలసి ఉంది. ఈ వారాంతానికి నాలుగు బస్సులు రానున్నాయి. మిగిలినవి ఈ నెలాఖరులోగా వచ్చేస్తాయని అధికారులు వెల్లడించారు. కొత్త బస్సులను అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సర్వీసులుగా నడపాలని అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, బెంగళూరు, భువనేశ్వర్, కోరాపుట్, తిరుపతి, విజయవాడ, భీమవరం, కడప, రాజమండ్రి, కాకినాడ, శ్రీశైలం, భద్రాచలం, శ్రీకాకుళం, పలాస, పర్లాకిమిడి వంటి ప్రాంతాలకు నడపనున్నారు. ఈ రూట్‌లలో ప్రస్తుతం సేవలందిస్తున్న బస్సుల్లో బాగా పాతబడిన వాటిని తొలగించి కొత్త బస్సులు వేయనున్నారు. ఈ తొలగించిన పాత బస్సులను రీఫిట్ చేసి, ఆధునికీకరించనున్నారు. సిటీలో తిరుగుతున్న కాలం చెల్లిన బస్సులను తొలగించి వాటి స్థానంలో ఈ ఆధునికీకరించిన బస్సులు నడపనున్నారు.

పోస్టింగ్‌కు పైరవీలు

... 3వ పేజీ తరువాయి

గుర్తింపుపొందారు. ఉన్నతాధికారులకు ఎదురు తిరగడం, అంతా విధులకు ఉదయం పది గంటలకు వస్తే వీరు తీరుబడిగా మధ్యాహ్నం 12 గంటలకు రావడం, ఆ తరువాత లంచ్ పేరుతో ఇంటికి వెళ్లిపోయి తిరిగి విధులకు హాజరుకాకపోవడం వంటి పనులు చేసేవారని ఉద్యోగ భవన్ వర్గాల భోగట్టా. సెక్రటరీ అంటే సంస్థ పరిపాలనా వ్యవహారాలన్నీ చూడాల్సి ఉంటుంది కాబట్టి నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే వారిని నియమించాల్సి ఉంది. సిఫారసులకు తలొగ్గితే ఆ తరువాత తల దించుకునే పరిస్థితి రాక తప్పదు. ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలు ఆచితూచి వ్యవహరించక తప్పదు.

కొళాయి నీరు కలుషితం

... 3వ పేజీ తరువాయి

చాలాకాలంగా ఉన్నాయి.

ఇంటింటికీ నీటిని సరఫరా చేసేందుకు నగరంలో అంతర్గతంగా సుమారు మూడు వేల కిలోమీటర్లు పొడవున పైపులైన్లు వేశారు. అవి కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు, గెడ్డలు రిటైనింగ్ వాల్స్‌కు ఆనుకుని ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు డ్రైనేజీలు, గెడ్డలు పొంగుతుంటాయి. ఆ సమయంలో మంచినీటి పైప్‌లైన్‌లకు ఎక్కడైనా లీకులుంటే మురుగునీరు చేరిపోయి కలుషితమవుతోంది. వర్షాకాలం వస్తే కొళాయిల నుంచి బురదనీరు వస్తోందని వన్‌టౌన్, కంచరపాలెం, డాబాగార్డెన్స్, అల్లిపురం, తదితర ప్రాంతాల వాసులు వాపోతుంటారు. అయినప్పటికీ జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు అటువంటి అవకాశం లేదంటూ చెబుతుంటారు. ఈ విషయంలో ఉన్నతాధికారులను సైతం పక్కదారిపట్టించేస్తున్నారు.

కేఆర్ఎం కాలనీలో గత పది రోజులుగా కొళాయిల నుంచి మురికినీరు వస్తోంది. దుర్వాసన వస్తుండడంతో ఎవరూ తాగలేని పరిస్థితి ఏర్పడింది. తమ ప్రాంతంలో మురికినీరు సరఫరా అవుతోందని అధికారులకు స్థానికులు గత పది రోజులుగా ఫిర్యాదు చేసినా ఇంతవరకూ సమస్యను పరిష్కరించలేదు. మూడు రోజుల కిందట గొయ్యి ఒకచోట గొయ్యి తవ్వి వెళ్లిపోయారు. అయితే ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. కొళాయిలో మురికినీరే సరఫరా అవుతోంది. దీంతో ఆ ప్రాంతానికి చెందిన శివకుమార్ అనే వ్యక్తి తమ ప్రాంతంలో కొళాయి ద్వారా వస్తున్న నీటిని మూడు బాటిళ్లలో నింపి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. అక్కడ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ విశ్వనాథన్‌ను కలిసి సమస్యను వివరించారు. బాటిళ్లలోని నీటిని చూసి ఆశ్చర్యపోయిన అదనపు కమిషనర్ వెంటనే అక్కడున్న నీటి సరఫరా విభాగం అధికారులను పిలిచి ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నగరంలో ఇలాంటి సమస్య ఇంకెక్కడుందో కూడా పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ గత్యంతరం లేక అదే నీటిని కాచి చల్లార్చుకుని తాగుతున్నామన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు కళ్లు తెరిచి నగరంలో నీటినాణ్యతపై దృష్టిపెట్టాలి.

అగనంపూడిలో యువకుడి హత్య

» కుటుంబ కలహాల నేపథ్యంలో ఘాతుకం

» స్కూటీతో వెంబడించి, కత్తితో దాడిచేసి ఘాతుకం


మృతి చెందిన సూర్యకిరణ్


మృతుడు (ఫైల్‌ఫొటో)


నిందితుడు కొర్లయ్య

కూర్మన్నపాలెం, జూలై 8: కుటుంబ కలహాలు నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. ఈ సంఘటన అగనంపూడి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో సోమవారం జరిగింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...

మల్కాపురం సమీప ప్రకాష్‌నగర్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ దాడి సూర్య కిరణ్ (25), శ్రీనగర్‌కు చెందిన పసుపులేటి మేఘన ప్రేమించుకుని గత ఏడాది పెళ్లి చేసుకున్నారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడే కాపురం పెట్టారు. మేఘనకు తండ్రి లేకపోవడంతో తల్లి సుజాత ఆమెను పెంచింది. కుమార్తె కులాంతర వివాహం చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో రెండు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. కాగా మేఘన గర్భవతి కావడంతో దంపతులు హైదరాబాద్ నుంచి మల్కాపురం వచ్చేశారు. మేఘన జూలై 1న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మనుమరాలిని చూసేందుకు సుజాత అగనంపూడి ఆస్పత్రికి రావడంతో సూర్యకిరణ్ అడ్డుకున్నాడు.

ఇది తట్టుకోలేని ఆమె గంగవరానికి చెందిన యెజ్జర్ల కొర్లయ్యతో విషయం చెప్పింది. ఆగ్రహించిన కొర్లయ్య సోమవారం రాత్రి అగనంపూడి ఆస్పత్రికి వెళ్లాడు. మేఘనను మంగళవారం ఇంటికి పంపిస్తామని వైద్యులు చెప్పడంతో సోమవారం రాత్రి పది గంటల సమయంలో సూర్యకిరణ్ తన తమ్ముడు ప్రసాద్‌తో కలసి ద్విచక్రవాహనంపై మల్కాపురం బయలుదేరాడు. అగనంపూడి ఆంజనేయస్వామి గుడి కూడలి వద్దకు వచ్చేసరికి, అక్కడ కాపు కాసిన కొర్లయ్య వారిని స్కూటీపై వెంబడించాడు. వారి వాహనాన్ని ఆపి సూర్యకిరణ్‌తో గొడవపడ్డాడు. ఆవేశంతో తన వెంట తెచ్చుకొన్న కత్తితో బలంగా రెండు చోట్ల పొడిచేశాడు. తీవ్రంగా గాయపడిన సూర్యకిరణ్‌ను అతడి తమ్ముడు ప్రసాద్ స్థానికుల సాయంతో అగనంపూడి ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు కొర్లయ్యపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూర్యకిరణ్ తండ్రి భాస్కరరావు గతంలోనే మృతిచెందగా, తల్లి పద్మ, తమ్ముడు ప్రసాద్ ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దకుమారుడు హత్యకు గురవడంతో తల్లి పద్మ బోరున విలపిస్తోంది.

ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ కర్త వైవీసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని వైఎస్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలాగురువులు హాజరయ్యారు. ఇదిలావుండగా మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.


వైఎస్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రిని కలిసిన 'సీ' ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 8: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సంపూర్ణ సహకారిన్ని అందించాలని కోరుతూ కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు సోమవారం భీమవరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ పరిస్థితి ఇబ్బందిగా మారిందని, ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయన్నారు. స్టీల్‌ప్లాంట్ విస్తరణకు ప్రభుత్వం రూపాయి కూడా కేటాయించలేదని, పూర్తిగా అంతర్గత నిధులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకువచ్చిన రూ.20 వేల కోట్లు ఇప్పుడు తీవ్ర నష్టాలకు గురయ్యేలా చేసిందని వారు వివరించారు. స్టీల్‌ప్లాంటులో పర్యటించి కర్మాగార పరిస్థితులను గమనించాలని శ్రీనివాసవర్మకు విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు చంద్రరావు, కేవీడీ ప్రసాద్, వెంకటేశ్వరరావు, రమావత్, నరసింహ ఉన్నారు.

91వ వార్డులో గణబాబు పర్యటన

గోపాలపట్నం, జూలై 8: జీవీఎంసీ 91వ వార్డు పాతపగోపాలపట్నంలో సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పర్యటించారు. పలు వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఆరాతీశారు. డ్రైనేజీ సమస్య ఎదురవుతోందని అపార్టుమెంట్ వాసులు తెలిపారు. సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే జీవీఎంసీ అధికారులకు ఆదేశించారు. దశలవారీగా అన్ని సమస్యలు పరిష్కరించి, పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వార్డు నాయకులు ఉన్నారు.

జోనల్ అధికారులతో జెడ్సీ సమీక్ష

గాజువాక, జూలై 8: గాజువాక జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో జెడ్సీ సన్యాసినాయుడు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాంతాల అభివృద్ధి, పారిశుధ్యం నీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్యలేకుండా చూడాలని, తాగునీరు అందించాలని, వీధి లైట్లు వేయాలని, రోడ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. సమావేశంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన ర్యాలీ

పెందుర్తి, జూలై 8: అతిసార నుంచి రక్షణపై అవగాహన కల్పిస్తూ సోమవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది చినముషిడివాడలో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ శేనాపతి వసంత ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ వాతావరణ మార్పుల దృష్ట్యా పిల్లలు అతిసార వ్యాధి బారిన పడకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలని, సురక్షిత నీటిని తాగాలన్నారు.

లారీ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యవర్గం

మల్కాపురం, జూలై 8: విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం మల్కాపురంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కేవీఎస్ మూర్తి, అధ్యక్షుడిగా పి.లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా కె.అప్పారావు, కోశాధికారిగా కాశీ విశ్వనాథ్ ఎనికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లారీ యజమానులు, అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యాదవుల సమావేశాన్ని సక్సెస్ చేయాలి

వేపగుంట, జూలై 8: జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. నాయుడుతోటలో సోమవారం పెందుర్తి యాదవ సంఘం అధ్యక్షుడు చందక చలపతి ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతూ జిల్లా సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లను సన్మానించనున్నామన్నారు. సమావేశంలో అయితి ఎర్నిబాబు, కోడిబోయిన శ్రీను, అయిత సింహాచలం, పి.ఎర్నిబాబు, పీతల విష్ణు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **మహారాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
● **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
● **14 :** వెంకటేశ్వర
● **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
● **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 39, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 48, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 32, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 90, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 32, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 54, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్యాప్సికం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	--	103
ఫారం ధర	--	123
విత్ స్కిన్	--	216
స్కిన్‌లెస్	--	226

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..

జమ కాని స్టాంపు డ్యూటీ ఆదాయం

- పెందుర్తి మండలంలో రూ.12 కోట్ల బకాయిలు
- అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలు నిర్వీర్యం
- ఆర్థిక సంఘం నిధులూ మళ్లింపు
- కూటమి ప్రభుత్వంపైనే సర్పంచ్‌ల ఆశలు



పెందుర్తిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పెందుర్తి, జూలై 8:
పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ నిధులను దారిమళ్లించింది. దీనికితోడు స్టాంప్ డ్యూటీ ఆదాయం గత మూడేళ్లుగా జమ చేయలేదు. దీంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. పెందుర్తిలోని సబ్ రిజిస్ట్రార్ శాఖ కార్యాలయానికి ఏటా రూ.75 కోట్ల ఆదాయం లభిస్తోంది. ప్రతి రిజిస్ట్రేషన్‌పై 7.5 స్టాంపు డ్యూటీ వసూలు చేస్తారు. ఇలా వసూలైన సొమ్ములో ఆరు శాతం ప్రభుత్వ ఖజానాకు, మిగిలిన 1.5 శాతం స్థానిక సంస్థలైన మునిసిపాలిటీ, జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల ఖాతాలకు ప్రతి నెలా జమ చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో వసూలవుతున్న స్టాంపు డ్యూటీని ఐదొంతులుగా విభజిస్తారు. ఇందులో మూడొంతులు రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గల సంబంధిత పంచాయతీలకు, ఒక శాతం మండల పరిషత్, మరో వంతు జడ్పీ ఖాతాలో జమ చేస్తారు. ఈ లెక్కన పెందుర్తిలో స్టాంప్ డ్యూటీ రూపంలో వచ్చే ఆదాయంలో ఏటా దాదాపు రూ.4 కోట్లు స్థానిక సంస్థలకు జమ కావాల్సి ఉంది. ప్రతినెలా లెక్కలు చూసి గతంలో స్థానిక సంస్థలకు మళ్లించేవారు. ఈ సొమ్ములను పంచాయతీల అభివృద్ధికి వినియోగించేవి. గత మూడేళ్ల నుంచి పెందుర్తి మండలంలోని పంచాయతీలకు ఈ బకాయిలు చెల్లించడం లేదని సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు.

ఇవీ బకాయిలు..

మండలంలో 15 గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ 9 ఎంపీటీసీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో మూడేళ్ల బకాయిలు సుమారు రూ.12 కోట్లు. ఇప్పటికే పంచాయతీల ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. గ్రామాల్లో అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు నానాయాతన పడుతున్నారు. స్టాంప్ డ్యూటీ బకాయిలు పేరుకుపోవడంతో పంచాయతీల అభివృద్ధి మరింత కుంటుపడుతోందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అభివృద్ధి దూరంగా పంచాయతీలు

పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరైన స్టాంప్ డ్యూటీ సొమ్ములు జమ కాకపోవడంతో కనీసం గ్రామాల్లో చిన్నపాటి రోడ్డు కూడా వేయలేని దుస్థితి నెలకొంటోంది. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని చెప్పవచ్చు. విధులు, నిధులు లేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారారు. సచివాలయ వ్యవస్థతో సర్పంచ్‌ల అధికారాలతో పాటు నిధులను లాగేసుకుంది. దీనికితోడు వలంటీర్లను అందలం ఎక్కించి పంచాయతీల జవసత్వాలు లేకుండా చేసిందన్న విమర్శలున్నాయి. వైసీపీ సర్కారు కేంద్ర ఆర్థిక సంఘ నిధులు దారిమళ్లించింది. విద్యుత్ బిల్లులు చెల్లింపుల భారం పంచాయతీపైనే వేసింది. దీంతో గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావటంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిగా వ్యవహరిస్తున్నందున పంచాయతీ వ్యవస్థ బలోపేతం అవుతుందని పలువురు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్న యోచనలో సర్పంచ్‌లు

2021 మార్చిలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మండలంలో అధిక శాతం వైసీపీ మద్దతుదారులే సర్పంచ్‌లుగా గెలిచారు. రాంపురంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సతీమణి శిరీషా సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా సర్పంచ్‌లు నిధులు రాక తమ హయాంలో గ్రామాలు అభివృద్ధి చేశామని చెప్పుకునే అవకాశం దక్కలేదు. నిధులు రానందున సర్పంచ్‌లు అసంతృప్తితో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్టాంప్ డ్యూటీ వసూలుపై ఒత్తిడి తేవాలని సర్పంచ్‌లు యోచిస్తున్నారు.

గ్రామాభివృద్ధికి నిధులేవీ?



గత వైసీపీ సర్కార్ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. నిధులు, విధులు లేక సర్పంచ్‌లను ఇబ్బందులకు గురి చేసింది. కేంద్ర ఆర్థిక సంఘ నిధులను దారి మళ్లించడమే కాకుండా స్టాంప్ డ్యూటీ బకాయిలు జమ చేయలేదు. దీంతో కార్మికులకు వేతనాల చెల్లింపునకు ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా ఉన్నందున పంచాయతీ వ్యవస్థ బలోపేతమై, గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని భావిస్తున్నాం.

-గొర్లె రామకృష్ణ జగన్నాథం, సర్పంచ్, సరిపల్లి

జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 8: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో జగన్నాథస్వామి రథోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గుండిచా మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పూరీలో మాదిరిగానే ఇక్కడ కూడా ఒరియా పూజార్లు అర్చనలు, పూజలు చేస్తున్నారు. టౌన్‌షిప్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

అగనంపూడిలో కూర్మావతారంలో..

అగనంపూడి: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం జగన్నాథస్వామి సోమవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక్కడి ఇంద్రద్యుమ్ని మందిరంలో కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథునికి అర్చకులు సంతోశ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.



బలభద్ర, సుభద్రలతో కూర్మావతారంలో జగన్నాథుడు



ఉక్కుటౌన్‌షిప్‌లో పూజలందుకుంటున్న స్వామి

బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు లలితాసహస్రనామ పారాయణాన్ని పఠించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, జి.సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఆలయ మేనేజర్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళి

పలుచోట్ల ఘనంగా జయంతి వేడుకలు



పద్మనాభనగర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బెహరా భాస్కరరావు

కూర్మన్నపాలెం, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 87వ వార్డు కణితి గాంధీ బొమ్మ సెంటర్‌లో వైసీపీ నాయకులు ప్రగడ వేణుబాబు ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చింతలపూడి మాట్లాడుతూ పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను వైఎస్సార్ అమలు చేశారన్నారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రగడ విజయలక్ష్మి, ఎం.దామోదర్, డి.దానప్పలు, ఆనంద్, శంకరరావు, శ్రీనివాస్, జి.సన్యాసి నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 86వ వార్డు పరిధి వుడా నగర్‌లో వైఎస్ విగ్రహానికి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేయడంతో పాటు పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

అక్కిరెడ్డిపాలెం: మిందిలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైసీపీ నాయకులు గుడివాడ అప్పలరామ్మూర్తి, లతీశ్, సంధ్రాన నూకరాజు, ఈటి శ్రీరాములు, శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 62 వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

మల్కాపురం: మల్కాపురం ప్రధాన కూడలి, ప్రకాశనగర్ ఏడు గుళ్లు, శ్రీహరిపురం, గాజువాక ఆర్టీసీ డిపో ఏరియాతో పాటు పలు ప్రాంతాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్కాపురంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు కలిదండి బద్రీనాథ్, వైసీపీ నాయకుడు బోగవిల్లి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో పద్మనాభనగర్‌లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.



కణితిలో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న చింతలపూడి వెంకట్రామయ్య

పెందుర్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ 75వ జయంతిని సోమవారం పెందుర్తిలో నిర్వహించారు. గ్రేటర్ 96వ వార్డు వైసీపీ అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పెందుర్తి జంక్షన్‌లోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొణతాల దేవరాజు, అప్పాజీరావు, ఏవీ రమణ, శరగడం గణేశ్, మజ్జి రఘు తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పెందుర్తిలో కేకు కట్ చేసిన వైసీపీ 96వ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు

మత్తులో యువకుడి హల్‌చల్

వేపగుంట, జూలై 8: మద్యం మత్తులో ఓ యువకుడు నడిరోడ్డుపై హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన సింహాచలం గోశాల సమీపంలోని పద్మావతినగర్ వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. ఆరిలోవకు చెందిన లక్ష్మణ్ పూటుగా మద్యం సేవించి రోడ్డుపై నడిచి వెళ్తున్న వారిపై దాడి చేశాడు. దుర్భాషలాడుతూ చిందులు తొక్కాడు. దాదాపు గంటన్నర సమయం అటువైపు వెళ్లే వారిని ఇబ్బంది పెడుతుండడంతో స్థానికులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మణ్ కుటుంబసభ్యులను పిలిపించారు. అయితే వారితోనూ వాగ్వాదానికి దిగడంతో స్టేషన్‌కు తరలించారు.

డ్రైనేజీలో పడిన ఆవును రక్షించిన పారిశుధ్య సిబ్బంది

అగనంపూడి, జూలై 8: ఇక్కడి గల్లవానిపాలెంలో డ్రైనేజీలో పడిపోయిన ఓ ఆవును జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది బయటకు తీసి రక్షించారు. సోమవారం ఉదయం సిబ్బంది స్థానికంగా పారిశుధ్య పనులు చేపడుతుండగా అక్కడకు మేతకు వచ్చిన ఆవు ఒక్కసారిగా డ్రైనేజీలో పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కోటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి తాళ్ల సాయంతో డ్రైనేజీ నుంచి ఆవును బయటకు తీశారు. ఆవును కాపాడిన పారిశుధ్య సిబ్బందిని స్థానికులు అభినందించారు.



డ్రైనేజీ నుంచి ఆవును తీస్తున్న సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 32 వినతులు

గాజువాక, జూలై 8: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 32 వినతులు అందాయి. తాగునీరు, వీధి లైట్లు, రహదారులకు మరమ్మతులు, తదితర అంశాలపై అధికారులు వినతులు స్వీకరించారు. ఆయా వినతులను జోనల్ అధికారులకు కమిషనర్ సన్యాసినాయుడు అందజేసి, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వేపగుంటలో 8 వినతులు స్వీకరణ

వేపగుంట: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది వినతులు అందాయి. 92వ వార్డు సాయినగర్‌లో కాలువలను శుభ్రం చేయాలని, గోపాలపట్నంలో అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని, 97వ వార్డు అశోక్‌నగర్‌లో అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, చినముషిడివాడలో రోడ్లు, కాలువలు నిర్మించాలని, 98వ వార్డు పద్మావతినగర్‌లో కాలువ నిర్మాణం చేపట్టాలని, గోశాల బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో టీడీఆర్ పంపిణీ చేయాలని పలువురు విన్నవించారు. ఆయా వినతులను సంబంధిత శాఖలకు పంపించి తగిన చర్యలు చేపడతామని జెడ్సీ కె.హేమవతి తెలిపారు.

'ఆత్మవిశ్వాసమే కార్మికుల ఆయుధం'

కూర్మన్నపాలెం, జూలై 8: ఆత్మవిశ్వాసమే కార్మికుల ఆయుధమని, పోరాటాల ద్వారానే స్టీల్‌ప్లాంటును కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,243వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతతో కార్మికులందరూ ఏకతాటిపైకి రావాలని, సమస్యలు ఎన్ని వచ్చినా ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే విజయాలు సిద్ధిస్తాయన్నారు. స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో ఉన్నందునే ప్రైవేటీకరణ చేస్తున్నామని కేంద్రం తప్పుడు ప్రచారాలు చేయటం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంటుక సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

సిద్ధార్థనగర్ కాలనీ 22ఏ సమస్యను పరిష్కరించాలని 'పల్లా'కు వినతి

కూర్మన్నపాలెం, జూలై 8: ఇక్కడి సిద్ధార్థనగర్ కాలనీవాసులు ప్రధానంగా ఎదుర్కొంటున్న 22ఏ సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కాలనీ బలిరెడ్డి ప్రతినిధులు నాగేశ్వరరావు, తదితరులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం కాలనీ ప్రతినిధులు సిద్ధార్థనగర్‌ను 22ఏ సమస్య మూడు దశాబ్దాలుగా వేధిస్తుందన్నారు. 1987లో బీహెచ్‌పీవీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు వడ్లపూడి సర్వే నంబర్-1 పార్టు, 5లోని రాతిచెరువులో తొమ్మిది ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ ధరకు కేటాయించారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులందరూ బీహెచ్‌పీవీ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీగా ఏర్పాటయ్యారు.

అయితే ఆ స్థలాన్ని రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా (22ఏ జాబితాలో) ఉన్నట్టు ఇప్పటివరకు చూపుతున్నారు. ఈ కారణంగా ఇక్కడ నిర్మించుకున్న ఇళ్లు, ప్లాట్ల అమ్మకాలకు ఆస్కారం లేకుండా పోయిందని వివరించారు. ఇళ్ల పునర్నిర్మాణానికి కానీ ఆధునికీకరణకు గానీ జీవీఎంసీ అనుమతులు ఇవ్వడం లేదని, అత్యవసరమైతే బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకోలేకపోతున్నట్టు తెలిపారు. అదేవిధంగా పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ప్లాట్లు అమ్ముకుందామన్న వీల్లేకుండా పోతుందని, అందువల్ల 22ఏ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మూర్తి, బసవరాజు, కృష్ణ నాయక్, సత్యనారాయణ, దాలయ్య, తదితరులు ఉన్నారు.

రోగులతో గోపాలపట్నం సీహెచ్‌సీ కిటకిట



ఓపీ వద్ద టోకెన్ల కోసం బారులుతీరిన రోగులు

గోపాలపట్నం, జూలై 8: స్థానిక రైతుబజారులో సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కొద్ది రోజులుగా రోగులతో కిటకిటలాడుతోంది. ఆస్పత్రి అభివృద్ధి చేసిన తరువాత చాలా విభాగాలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కొద్ది నెలలుగా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. ఇదిలా ఉంటే జ్వరాలు, సీజనల్ వ్యాధులు విస్తృతమవడంతో వైద్య సేవల కోసం వచ్చే రోగులతో ఆస్పత్రి రద్దీగా మారుతోంది. ఓపీ వద్ద ఉదయం 9 గంటల నుంచే రోగులు బారులుతీరి కనిపిస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

పెదగంట్యాడ, జూలై 8: జీవీఎంసీ 66వ వార్డులో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ వార్డు అధికార ప్రతినిధి నెల్లి సాధూరావు జోనల్ కమిషనర్ సన్యాసినాయుడును సోమవారం ఒక వినతిపత్రం అందజేశారు. వార్డులోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పూడికలు చేరాయని, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని, దీనివల్ల దోమల ప్రభావం అధికంగా ఉందని జెడ్సీకి వివరించారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందని, తక్షణమే కాలువల్లో పూడికలను తీయించాలని, దోమల నివారణకు క్రిమిసంహారిక మందులు చల్లాలని, వార్డులోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించాలని కోరారు.

తాగునీటి సమస్యపై స్పందించిన జనసైనికులు

సింధియా, జూలై 8: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలోని అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు సదుపాయం లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నిర్వహించిన జనసేన జనబాట కార్యక్రమంలో ఈ సమస్య గురించి తెలుసుకున్న పార్టీ వార్డు అధ్యక్షుడు గొరుసూటి శివ దీనిపై స్పందించి ఐదేళ్లపాటు జనసేన తరపున ఉచితంగా తాగునీటిని అంగన్‌వాడీ కేంద్రానికి అందిస్తామన్నారు. అలాగే ఈ కేంద్రంలో నెలకొన్న సమస్యలను జనసేన రాష్ట్ర కార్యదర్శి అంగ దుర్గాప్రశాంతి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసైనికులు నానాజీ, లలిత, ప్రదీప్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ కార్యవర్గం



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు మురళీధరరెడ్డి

ఆటోనగర్, జూలై 8: లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీ క్లబ్ హౌస్‌లో ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షునిగా అమిరెడ్డి మురళీధరరెడ్డి, కార్యదర్శిగా కె.ప్రసాద్‌నాయుడు, కోశాధికారిగా బి.లక్ష్మణ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మురళీధరరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు రూ.30 వేల స్కాలర్‌షిప్‌లను అందజేశామని, కాలుష్య నివారణకు మొక్కలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గత ఏడాది ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, క్లబ్‌లో నూతనంగా 50 మంది సభ్యులను చేరారని, దీంతో ఈ సంఖ్య 113కు చేరిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ వీవీఎన్ఎంరాజా, లయన్స్ క్లబ్ పెద్దలు డీఎస్ఎస్‌బీ వర్మ, డి.రాఘవేంద్రరావు, కేవీ సుబ్బరాజు, అవిరెడ్డి సూర్యనారాయణ, కేవీఎస్ ప్రసాద్, ఎ.గోపాలరావు, బంగార్రాజు, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

మల్కాపురం ట్రాఫిక్ సీఐ ఎస్.షణ్ముఖరావు



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ షణ్ముఖరావు

సింధియా, జూలై 8: ద్విచక్ర వాహనదారులందరూ విధిగా హెల్మెట్ ధరించాలని మల్కాపురం ట్రాఫిక్ సీఐ ఎస్.షణ్ముఖరావు సూచించారు. సోమవారం సింధియా కూడలిలో తమ సిబ్బందితో కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. రోడ్డు ప్రమాదం జరిగే సమయంలో హెల్మెట్ లేకపోవడం వల్ల ఎంతోమంది తలకు గాయాలై మృత్యువాత పడ్డారన్నారు. అందువల్ల ద్విచక్ర వాహనదారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా హెల్మెట్లు ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గండి బాబ్జీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న బాబ్జీ

విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి: కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను తెలుగుదేశం విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండిబాబ్జీ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మాధవధార, జూలై 8 ; మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను గ్రేటరు 51 వవార్డులో ఘనంగా జరిపారు. కార్పొరేటరు ఆర్.వెంకటరమణ వై.ఎస్. చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.ఆయన చేసిన ప్రగతిని వివరించారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు, మహిళలు, కార్యకర్తలున్నారు.


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు,

అక్కయ్యపాలెం, జూలై 8 : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన ముఖ్యమం త్రిగా చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు కేక్ తినిపించారు.

ఆగస్టు 5 నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

» మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, జూలై 8: విజయవాడ స్టేషన్ వద్ద మూడో లైను నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు విశాఖ - తిరుపతి /కడప ఎక్స్‌ప్రెస్ (17488), ఆగస్టు ఆరు నుంచి 11వ తేదీ వరకు కడప /తిరుపతి- విశాఖ ఎక్స్‌ప్రెస్ (17487)లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), విశాఖ- లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), భువనేశ్వర్- ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), షాలిమార్- హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727); ఆగస్టు 5 నుంచి 9 వరకు విశాఖ- నిజాముద్దీన్ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ (12803); ఆగస్టు 8న విశాఖ- సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503), టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్ ప్రెస్ (18111), విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (20803) రైళ్లు వయా గుణదల, రాయనపాడు మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయి. ఆగస్టు 2 నుంచి 10 వరకు సికింద్రాబాద్ - విశాఖ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), ముంబాయి- భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), సాయినగర్ షిర్డీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18504), లోకమాన్య తిలక్-విశాఖ ఎల్ టీటీ ఎక్స్‌ప్రెస్ (18520); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్- విశాఖ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046) ; ఆగస్టు 4, 7న నిజాముద్దీన్- విశాఖ స్వర్ణజయంతిఎక్స్‌ప్రెస్ (12804); ఆగస్టు 4న గాంధీధాం- విశాఖ ఎక్స్‌ప్రెస్ (20804), ఆగస్టు 7న ఓకా-పూరి ఎక్స్‌ప్రెస్ (20820) రైళ్లు వయా రాయనపాడు, గుణదల మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయి. ఈ రైళ్లకు రాయలపాడులో హాల్ట్ కల్పించారు.

చదువుతోనే భవిష్యత్తు

డాబాగార్డెన్స్, జూలై 8: చదువు ద్వారానే భవిష్యత్తు సాధ్యమని ఎంపీడీవోలు బి.పైడపునాయుడు, బి.పుష్యరాగం పిలుపునిచ్చారు. సోమవారం జీవీఎంసీ మోడల్ ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లోని ర్యాలీలు నిర్వహించారు. నేను బడికిపోతా.. ద్వారా పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కనకమహాలక్ష్మి, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, సీఆర్‌పీలు పాల్గొన్నారన్నారు.


ర్యాలీలో ఎంపీడీవోలు పైడపునాయుడు, పుష్యరాగం

కేంద్రీయ విద్యాలయాల్లో క్రీడా పోటీలు ప్రారంభం

కంచరపాలెం, జూలై 8 : స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో సోమవారం రీజియన్ స్థాయిలో బాలికల హ్యాండ్‌బాల్ పోటీలను ప్రిన్సిపాల్ జి. కిశోర్, శ్రీరతన్ దీప్ షోరయస్ సోమవారం ప్రారంభించారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని అండర్-14 విభాగం నుంచి 114 మంది బాలికలు, అండర్-17 విభాగంలో 14 మంది బాలికలు ఎనిమిది పాఠశాలల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి కెప్టెన్ శ్రీ రతన్‌దీప్ షోరయస్ మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ జి.కిశోర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన బాలికలు హైదరాబాద్ రీజియన్ తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మదీనా మాలిక్, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.


బాస్కెట్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

అక్కయ్యపాలెం : గ్రేటర్ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో సోమవారం పీటీ మాస్టార్ రియాజ్ ఖాన్, ప్రిన్సిపల్ కమల్‌జిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డీఆర్‌ఎం పరిచయం చేసుకున్నారు. ఈ పోటీల్లో అండర్-14, అండర్ 17 బాలురు పాల్గొన్నారు. అండర్ -14లో మూడు పాఠశాలలు పాల్గొన్నాయి. అండర్-17లో ఆరు పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీలు మంగళవారం కూడా జరుగుతాయి. విజేతలకు ఈకో రైల్వే ఏడీఆర్‌ఎం సుధీర్ గుప్తా బహుమతులు ప్రదానం చేయనున్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న కెప్టెన్ శ్రీరతన్ దీప్,ప్రిన్సిపాల్ కిశోర్

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

మర్రిపాలెం: హైదరాబాద్ రీజియన్ పరిధిలోగల కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులకు 104 ఏరియాలోని కేంద్రీయ విద్యాలయం-2 హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం ప్రిన్స్‌పాల్ సీహెచ్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్నేహం, ఐకమత్యం, పోటీతత్వం పెంపొందేంచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్స్‌పాల్ శ్రీనివాసులు

డ్రైనేజీలో పూడికలు తొలగింపు

అక్కయ్యపాలెం, జూలై 8 : గ్రేటర్ 42వ వార్డులో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న డ్రైనేజీ పునర్నిర్మాణ పనులతో మురుగు నీరు రహదారిపైకి చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో టీడీపీ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి , జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు. ఏఎంహెచ్‌వో సునీల్ కుమార్ సోమవారం ఉదయం పారిశుధ్య సిబ్బందిని పంపించి డ్రైనేజీల్లోని చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించారు. రోడ్డుపై మురుగునీటిని కాలువల్లోకి మళ్లించారు. ఈ పనుల పర్యవేక్షణలో జీవీఎంసీ ఎస్ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొర, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ ఉన్నారు.

కెమికల్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేవీ రమణ, తల్లిదండ్రులు

కంచరపాలెం, జూలై 8 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లొమా చదువుచున్న విద్యార్థులకు ప్రగతి మెరిట్ పురస్కారాలు లభించాయి. బాలికలను పోత్సహించాలనే ఉద్దేశంతో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ వారు పదో తరగతితో పాటు పాలీసెట్‌లో ర్యాంకు సాధించిన మెరిట్‌ను ఆధారంగా ఈ స్కాలర్‌షిప్పులు ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్ డిప్లొమ చేస్తున్న ఎం.స్నేహారిక, కె.చాందిని, వై.లక్ష్మి, బి.రోహిత, కె.దేష్న, బి.రాజ్యశ్రీ (పెట్రో కెమికల్స్),పి.స్వర్ణలత (ఆయిల్ టెక్నాలజీ) తదితరులకు ఈ స్కాలర్‌షిప్పులు లభించాయి.ఈ మేరకు బాలికలను తల్లిదండ్రులు సమక్షంలో ప్రిన్సిపాల్ అభినందించారు. వీరికి మూడేళ్ల పాటు ఈ నగదు ప్రోత్సాహకాలు అందనున్నాయి. అధ్యాపకులు డా.బీవీ. లక్ష్మణరావు, సీహెచ్. జయప్రకాశ్ రెడ్డి, డి.దామోదర్, డా.ప్రశాంత కుమారి, డా.పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పార్కులో వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ


ట్రాక్ ప్రారంభిస్తున్న వైశాఖీ స్పోర్ట్సు పార్కు, సభ్యులు

మురళీనగర్, జూలై 8 ; మురళీనగర్‌లోని వైశాఖీ స్పోర్ట్సు పార్కులో నవీకరణ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఉదయం, సాయంత్రం వ్యాయామానికి వచ్చే వాకర్స్‌కి సరికొత్త వాకింగ్ ట్రాకుని అందుబాటులోకి తెచ్చారు. రెండెకరాల సువిశాల పార్కులో చుట్టూ వాకింగ్ ట్రాక్‌లో గోతులను పూడ్చి, ఎర్రమట్టి నింపి నడకదారులకు అనువుగా సిద్ధం చేశారు. ఈ కొత్త ట్రాక్‌ని సోమవారం పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్కు కమిటీ కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఉపాధ్యక్షులు పల్లా.చంద్రమౌళి సభ్యులు ఉన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ


విజేతలతో రైల్వే స్పోర్ట్సు కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 8: జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కేశవరావు స్మారక జిల్లా స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి వాల్తేరు స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి మురళీపాత్రో, వీఎస్ఎన్.మూర్తి, అచ్యుత్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: బాలుర అండర్-9 విభాగంలో అన్వర్, ధన్విత్, దియాంశ్; అండర్-11 కేటగిరిలో ఆర్యన్ గోపాల్, హస్విక్, వరుణ్ కృష్ణ ప్రథమ, ద్వి తీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. అభిషేక్ పాల్; అండర్-13 విభాగంలో ఎంఎస్. బాలాజీ, మోక్షజ్ఞ తేజ, ఎస్.హర్షిత్, ఎస్.కె. ఖ్వాజా సుల్తాన్; అండర్-15లో లిఖిత్‌మోహన్, జాషువా, సాయిచరణ్, జాన్ వెస్లీ; అండర్-17లో ఎస్.కె. రబ్బాని, అభిరామ్, కౌశిక్, కార్తీక్ గెలుపొందారు. సీనియర్ పురుషుల విభాగంలో రవివర్మ, సెంధిల్ నాథన్, రోహిత్, కె.కార్తీక్; బాలికల అండర్-9లో ఎస్.శ్రీయానిక, కె. ఆరోధ్య, ఈష, ధన్వి; అండర్-11లో వి.పూజిత, మోహితాక్షిత, జశ్మిత, షలాని విజేతలుగా నిలిచారు. అండర్-13లో టి.సన్విక, ఎస్.సెవితాశ్రీ, ధృతికిరణ్, షర్మిల; అండర్-15లో ఎస్.కె.ఆరిఫా సుల్తాన్, కె.రేణుక సత్య, రితీషా, నిత్య; అండర్-17లో టి.సాహితీ రాజ్, పి.మోహిత, జశ్మిత, ఆశ్రిత; సీనియర్ మహిళల కేటగిరిలో డి.దీక్షిత, ఎస్‌కే.రజ్వాన్, ఎం. దార్మికశ్రీ, దర్శిక వరుసగా విజేతలుగా నిలిచారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు


ఆక్రమణల తొలగింపులో సీఐ రేవతమ్మ, సచివాలయ సిబ్బంది

జగదాంబ కూడలి, జూలై 8: వన్‌టౌన్ వాచ్‌హౌస్ నుంచి పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీవీ ఎంసీ, ట్రాఫిక్ పోలీసు యం త్రాంగం కఠిన చర్యలకు దిగారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద జగన్నాథ రథయాత్ర నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్ర మించి వ్యాపారాలను ట్రాఫిక్ పోలీసులు మూడురోజులుగా తొలగిస్తున్నారు. ఇక నుంచి ఎట్టిపరిస్థితుల్లో ఆక్రమణలను అనుమతించేదిలేదని జీవీ ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఆదేశించారు. దీంతో శని, ఆదివారాలు ఫుట్‌పాత్ వ్యాపారాలు పూర్తిగా మూతబడ్డాయి. అయితే, సోమవారం ఉదయం మళ్లీ దుకాణాలు వెలిశాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది, జీవీఎంసీ-4 సచివాలయం సిబ్బంది రంగంలోకి దిగి ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగించారు. రథయాత్ర మహోత్సవాలకు భక్తులు రాక నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఖాళీ చేయించారు.

ఇసుక డిపోలపై తర్జనభర్జన

... 3వ పేజీ తరువాయి

విధానంపై కీలక నిర్ణయం తీసుకుని ఉచితంగా సరఫరా ప్రారంభించారు. దీని ప్రకారం రీచ్‌ల వద్ద అయితే ఒకరికి రోజుకు ఉచితంగా 20 టన్నుల ఇసుక సరఫరా చేస్తారు. అయితే పలు రకాల పన్నుల కింద టన్నుకు రూ.260 చెల్లించాల్సి ఉంటుంది. రీచ్‌లు ఉన్న జిల్లాల్లో నిర్మాణదారులకు ఇబ్బంది ఉండదు. సమస్య అంతా విశాఖ జిల్లాలోనే. ఇటు గోదావరి, అటు వంశధార, నాగావళి నదుల నుంచి ఇసుక విశాఖ జిల్లాకు తీసుకువచ్చి నిర్ణీత ధరకు విక్రయించాలంటే డిపోలు కొనసాగించాలి. ప్రస్తుతం జిల్లాలో అగనంపూడి, భీమిలి డిపోల్లో గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు తీసుకువచ్చిన 1.9 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. అది రెండు, మూడు నెలల వరకు సరిపోతుందని అంచనా వేస్తున్నారు. టన్ను ఇసుక అగనంపూడిలో రూ.1,394, భీమిలిలో రూ.758కు సోమవారం నుంచి విక్రయాలు ప్రారంభించారు. ఆ ఇసుక విక్రయించిన తరువాత డిపోలు కొనసాగిస్తారా?, లేదా?...అన్నది ఇంకా తెలియడం లేదు. రెండు డిపోలు నిర్వహించాలంటే ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి. ఒక డిపో నిర్వహించాలంటే కనీసం 20 మంది సిబ్బంది ఉండాలి. గోదావరి, వంశధార, నాగావళి నదుల్లోని రీచ్‌ల వద్ద కూడా కొంతమంది సిబ్బంది ఉండాలి. అయితే ఏపీఎండీసీ వద్ద అంత సిబ్బంది లేరు. జిల్లా గనుల శాఖలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. వీరంతా రెగ్యులర్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. పోనీ గ్రామ/వార్డు సచివాలయం సిబ్బంది ద్వారా డిపోల నిర్వహణ, రవాణా తదితర విధులు చేపట్టాలన్నా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవాలి. ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేసి కొంతమంది సిబ్బందిని నియమించుకుని వారి ద్వారా ఇసుక రవాణా, డిపోల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ చేయవచ్చు. చిన్న చిన్న అవసరాలకు ఇసుక కావాలనుకునే వారంతా రీచ్‌లకు వెళ్లి తెచ్చుకోవడం సాధ్యం కాదని, అందువల్ల విశాఖ జిల్లాలో డిపోలు కొనసాగించడం అవసరమని సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అందుకు రెండు, మూడు నెలలు పట్టవచ్చునన్నారు.

ప్రైవేటుగా అమ్మకాలు నిషేధం

ఇదిలావుండగా ఉచిత ఇసుక విధానం అమలు నేపథ్యంలో నగరం, పరిసరాల్లో ప్రైవేటుగా ఇసుక అమ్మకాలు నిషేధించారు. అనధికారికంగా ఇసుక విక్రయిస్తే భారీగా జరిమానా విధిస్తారు.

రేటు తగ్గే అవకాశం?

ప్రస్తుతం అగనంపూడిలో ఇసుక టన్ను రూ.1,394, భీమిలిలో రూ.758గా నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో రీచ్‌ల వద్ద టన్నుకు రూ.475 చెల్లించి నగరానికి కాంట్రాక్టర్లు ఇసుక తీసుకువచ్చారు. అక్కడ పన్నులు, రవాణా ఖర్చులు పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ధర నిర్ణయించామని అధికారులు వివరించారు. డిపోల్లో అందుబాటులో ఉన్న ఇసుక అమ్మకాలు తరువాత ధర కొంత వరకు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. టన్నుకు రూ.200 వరకు తగ్గే అవకాశం ఉందని, అయితే దీనిపై మరింత స్పష్టత రావల్సి ఉందన్నారు.

విశాఖ రీజియన్‌కు కొత్త బస్సులు

... 3వ పేజీ తరువాయి

లగ్జరీ సర్వీసులు వచ్చాయి. మరో 33 సూపర్ లగ్జరీ సర్వీసులు రావలసి ఉంది. ఈ వారాంతానికి నాలుగు బస్సులు రానున్నాయి. మిగిలినవి ఈ నెలాఖరులోగా వచ్చేస్తాయని అధికారులు వెల్లడించారు. కొత్త బస్సులను అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సర్వీసులుగా నడపాలని అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, బెంగళూరు, భువనేశ్వర్, కోరాపుట్, తిరుపతి, విజయవాడ, భీమవరం, కడప, రాజమండ్రి, కాకినాడ, శ్రీశైలం, భద్రాచలం, శ్రీకాకుళం, పలాస, పర్లాకిమిడి వంటి ప్రాంతాలకు నడపనున్నారు. ఈ రూట్‌లలో ప్రస్తుతం సేవలందిస్తున్న బస్సుల్లో బాగా పాతబడిన వాటిని తొలగించి కొత్త బస్సులు వేయనున్నారు. ఈ తొలగించిన పాత బస్సులను రీఫిట్ చేసి, ఆధునికీకరించనున్నారు. సిటీలో తిరుగుతున్న కాలం చెల్లిన బస్సులను తొలగించి వాటి స్థానంలో ఈ ఆధునికీకరించిన బస్సులు నడపనున్నారు.

పోస్టింగ్‌కు పైరవీలు

... 3వ పేజీ తరువాయి

గుర్తింపుపొందారు. ఉన్నతాధికారులకు ఎదురు తిరగడం, అంతా విధులకు ఉదయం పది గంటలకు వస్తే వీరు తీరుబడిగా మధ్యాహ్నం 12 గంటలకు రావడం, ఆ తరువాత లంచ్ పేరుతో ఇంటికి వెళ్లిపోయి తిరిగి విధులకు హాజరుకాకపోవడం వంటి పనులు చేసేవారని ఉద్యోగ భవన్ వర్గాల భోగట్టా. సెక్రటరీ అంటే సంస్థ పరిపాలనా వ్యవహారాలన్నీ చూడాల్సి ఉంటుంది కాబట్టి నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే వారిని నియమించాల్సి ఉంది. సిఫారసులకు తలొగ్గితే ఆ తరువాత తల దించుకునే పరిస్థితి రాక తప్పదు. ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలు ఆచితూచి వ్యవహరించక తప్పదు.

కొళాయి నీరు కలుషితం

... 3వ పేజీ తరువాయి

చాలాకాలంగా ఉన్నాయి.

ఇంటింటికీ నీటిని సరఫరా చేసేందుకు నగరంలో అంతర్గతంగా సుమారు మూడు వేల కిలోమీటర్లు పొడవున పైప్‌లైన్లు వేశారు. అవి కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు, గెడ్డలు రిటైనింగ్ వాల్స్‌కు ఆనుకుని ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు డ్రైనేజీలు, గెడ్డలు పొంగుతుంటాయి. ఆ సమయంలో మంచినీటి పైప్‌లైన్‌లకు ఎక్కడైనా లీకులుంటే మురుగునీరు చేరిపోయి కలుషితమవుతోంది. వర్షాకాలం వస్తే కొళాయిల నుంచి బురదనీరు వస్తోందని వన్‌టౌన్, కంచరపాలెం, డాబాగార్డెన్స్, అల్లిపురం, తదితర ప్రాంతాల వాసులు వాపోతుంటారు. అయినప్పటికీ జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు అటువంటి అవకాశం లేదంటూ చెబుతుంటారు. ఈ విషయంలో ఉన్నతాధికారులను సైతం పక్కదారిపట్టించేస్తున్నారు.

కేఆర్ఎం కాలనీలో గత పది రోజులుగా కొళాయిల నుంచి మురికినీరు వస్తోంది. దుర్వాసన వస్తుండడంతో ఎవరూ తాగలేని పరిస్థితి ఏర్పడింది. తమ ప్రాంతంలో మురికినీరు సరఫరా అవుతోందని అధికారులకు స్థానికులు గత పది రోజులుగా ఫిర్యాదు చేసినా ఇంతవరకూ సమస్యను పరిష్కరించలేదు. మూడు రోజుల కిందట గొయ్యి ఒకచోట గొయ్యి తవ్వి వెళ్లిపోయారు. అయితే ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. కొళాయిలో మురికినీరే సరఫరా అవుతోంది. దీంతో ఆ ప్రాంతానికి చెందిన శివకుమార్ అనే వ్యక్తి తమ ప్రాంతంలో కొళాయి ద్వారా వస్తున్న నీటిని మూడు బాటిళ్లలో నింపి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. అక్కడ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ విశ్వనాథన్‌ను కలిసి సమస్యను వివరించారు. బాటిళ్లలోని నీటిని చూసి ఆశ్చర్యపోయిన అదనపు కమిషనర్ వెంటనే అక్కడున్న నీటి సరఫరా విభాగం అధికారులను పిలిచి ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నగరంలో ఇలాంటి సమస్య ఇంకెక్కడుందో కూడా పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ గత్యంతరం లేక అదే నీటిని కాచి చల్లార్చుకుని తాగుతున్నామన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు కళ్లు తెరిచి నగరంలో నీటినాణ్యతపై దృష్టిపెట్టాలి.

అగనంపూడిలో యువకుడి హత్య

» కుటుంబ కలహాల నేపథ్యంలో ఘాతుకం
» స్కూటీతో వెంబడించి, కత్తితో దాడిచేసి ఘాతుకం


మృతి చెందిన సూర్యకిరణ్


మృతుడు (ఫైల్‌ఫొటో)


నిందితుడు కొర్లయ్య

కూర్మన్నపాలెం, జూలై 8: కుటుంబ కలహాలు నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. ఈ సంఘటన అగనంపూడి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో సోమవారం జరిగింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...

మల్కాపురం సమీప ప్రకాష్‌నగర్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ దాడి సూర్య కిరణ్ (25), శ్రీనగర్‌కు చెందిన పసుపులేటి మేఘన ప్రేమించుకుని గత ఏడాది పెళ్లి చేసుకున్నారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడే కాపురం పెట్టారు. మేఘనకు తండ్రి లేకపోవడంతో తల్లి సుజాత ఆమెను పెంచింది. కుమార్తె కులాంతర వివాహం చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో రెండు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. కాగా మేఘన గర్భవతి కావడంతో దంపతులు హైదరాబాద్ నుంచి మల్కాపురం వచ్చేశారు. మేఘన జూలై 1న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మనుమరాలిని చూసేందుకు సుజాత అగనంపూడి ఆస్పత్రికి రావడంతో సూర్యకిరణ్ అడ్డుకున్నాడు.

ఇది తట్టుకోలేని ఆమె గంగవరానికి చెందిన యెజ్జర్ల కొర్లయ్యతో విషయం చెప్పింది. ఆగ్రహించిన కొర్లయ్య సోమవారం రాత్రి అగనంపూడి ఆస్పత్రికి వెళ్లాడు. మేఘనను మంగళవారం ఇంటికి పంపిస్తామని వైద్యులు చెప్పడంతో సోమవారం రాత్రి పది గంటల సమయంలో సూర్యకిరణ్ తన తమ్ముడు ప్రసాద్‌తో కలసి ద్విచక్రవాహనంపై మల్కాపురం బయలుదేరాడు. అగనంపూడి ఆంజనేయస్వామి గుడి కూడలి వద్దకు వచ్చేసరికి, అక్కడ కాపు కాసిన కొర్లయ్య వారిని స్కూటీపై వెంబడించాడు. వారి వాహనాన్ని ఆపి సూర్యకిరణ్‌తో గొడవపడ్డాడు. ఆవేశంతో తన వెంట తెచ్చుకొన్న కత్తితో బలంగా రెండు చోట్ల పొడిచేశాడు. తీవ్రంగా గాయపడిన సూర్యకిరణ్‌ను అతడి తమ్ముడు ప్రసాద్ స్థానికుల సాయంతో అగనంపూడి ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు కొర్లయ్యపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూర్యకిరణ్ తండ్రి భాస్కరరావు గతంలోనే మృతిచెందగా, తల్లి పద్మ, తమ్ముడు ప్రసాద్ ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దకుమారుడు హత్యకు గురవడంతో తల్లి పద్మ భోరున విలపిస్తోంది.

ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ కర్త వైవీసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని వైఎస్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలాగురువులు హాజరయ్యారు. ఇదిలావుండగా మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.


వైఎస్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



కల్యాణం చేస్తున్న అర్చకులు

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 8 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్యకల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

విత్తన బంతులతో హరిత విశాఖ

ఎంవీపీ కాలనీ, జూలై 8 : విత్తన బంతులతో హరిత విశాఖ సాధ్యమవుతుందని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు.ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు విత్తన బంతుల తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం విత్తన బంతులు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, వరల్డ్ వైడ్ లైఫ్ ఫర్ ప్రతినిధి హనీ, యాక్షన్ ఎయిడ్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ కృష్ణకుమారి, వాలంటీర్లు రవితేజ, రాజేశ్వరి, మంగరాజు, ఉషాకుమారి పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత అవసరం

ఆరిలోవ, జూలై 8 : సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. సోమవారం వారు శ్రీకృష్ణాపురంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి గురుకుల పాఠశాల వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ టీకే రమేష్, మెడికల్ అధికారి డాక్టర్ మహిత, హెల్త్ అసిస్టెంట్ సత్యన్నారాయణ, ఫార్మాసిస్ట్ ఎస్‌వై నాయుడు పాల్గొన్నారు.

14న మెగా రక్తదాన శిబిరం

సింహాచలం, జూలై 8 : జీవీఎంసీ 98వ వార్డులోని ఆర్ఆర్ ఫంక్షన్‌లో ఈనెల 14న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు సింహాచలం ప్రాంతానికి చెందిన నవయువ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు రోటరీ బ్లడ్ సెంటర్, వందేభారత్ బ్లడ్ బ్యాంకు సెంటర్ల సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

కార్మికుల సమస్యలపై పోరాటం

కొమ్మాది, జూలై 8 : భవన నిర్మాణ కార్మికులు ఎంతో కష్టపడి సాధించుకున్న సంక్షేమ బోర్డును కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. సోమవారం మధురవాడలో తాపీ పని చేస్తున్న లేబర్ కాంట్రాక్టర్లతో సీఐటీయూ అనుబంధంగా శ్రీదుర్గా భవన నిర్మాణ కార్మిక సంఘం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా స్వతంత్రనగర్‌లో జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాయిసూర్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

సిరిపురం, జూలై 8 : ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో పితానిదిబ్బ గవర్నమెంట్ మున్సిపల్ హైస్కూల్, న్యాయ సేవాధికారి సంస్థ సంయుక్తంగా సోమవారం మోటారు వాహనాల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెర్మనెంట్ లోక్ అదాలత్ ఛైర్మన్ జి. వల్లభనాయుడు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. వెంకట శేషమ్మ చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కె. శ్రీనివాసరావు, డి. శ్యామల, స్వర్ణగౌరీమణి, గంగభవానీ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహారాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 39, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 48, బీరకాయలు 42, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 32, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 140, బరబటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 32, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	103
ఫారం ధర	--	123
విత్ స్కిన్	--	216
స్కిన్‌లెస్	--	226

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..



తగరపువలస వంతెన కింద పేరుకుపోయిన డెబ్రిస్



విస్తీర్ణం తగ్గిపోయి పిల్ల కాలువ మాదిరి కనిపిస్తున్న నది

గోస్తనీలో పేరుకుపోతున్న వ్యర్థాలు

- నానాటికీ తగ్గిపోతున్న నది విస్తీర్ణం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకుడు
- విస్తీర్ణంపై సర్వే చేయాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశం

తగరపువలస, జూలై 8 : తగరపువలస పరిధిలో ఉన్న గోస్తనీ నదిలో రోజురోజుకి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన వారు నదిలో ఇష్టానుసారం చెత్తతో పాటు భవన నిర్మాణాల డెబ్రిస్‌ను పారబోస్తున్నారు. దీంతో నది దిశ మారిపోవడంతో పాటు చిన్న పిల్ల కాలువ మాదిరిగా తయారవుతోంది. నది వద్దకు వెళ్లడానికి సన్నని దారి ఏర్పాటు చేసి భవన నిర్మాణాల డెబ్రిస్‌ను ట్రాక్టర్లు, బళ్లతో తీసుకువచ్చి నది గర్భంలో పోస్తున్నారు. దీంతో నదిలో నీరు నిల్వ ఉండని పరిస్థితి నెలకొంది. నదిపై మూడు వంతెనలు ఉన్నాయి. ఒక వంతెన అయితే పిల్లర్లు కూడా కనిపించనంతగా చెత్తాచెదారం వేశారు. దీనివల్ల ఒకవైపు నుంచే నీరు ప్రవహిస్తోంది. నదిలో నీరు ప్రవహించడానికి అవకాశం లేకుండా చేయడం వల్ల చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ విషయమై టీడీపీ జిల్లా కార్యదర్శి వానపల్లి సత్యనారాయణ సోమవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. పట్టణ పరిధిలో నది విస్తీర్ణం ఎంత ఉందో సమగ్ర సర్వే చేయించాలని కోరారు.దీనిపై స్పందించిన కలెక్టర్ సర్వే చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. పట్టణ పరిధిలో వాస్తవంగా నది గర్భం ఎంత ఉండాలి ? ఎంత ఉందన్న విషయాన్ని నివేదిక రూపంలో పంపించాలని చెప్పారు. అలాగే నదిలో డెబ్రిస్ వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చిల్లపేట చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు

చిల్లపేట చెరువును అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నందున చెరువు విస్తీర్ణంపై సర్వే చేయాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్ట సురేష్ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన భీమిలిలోని జోనల్ కార్యాలయంలో జడ్సీకి వినతిపత్రం అందించారు. చెరువు చిట్టివలసలో సర్వే నంబరు 24లో 36.40 ఎకరాల్లో విస్తరించి ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయని, వాస్తవానికి చాలావరకు ఆక్రమణకు గురైందన్నారు. చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సమగ్ర సర్వే చేయాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తొమ్మిది వినతులు

భీమునిపట్నం, జూలై 8 : పట్టణంలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తొమ్మిది వినతులు అందాయి. 3వ వార్డులో ఉన్న బర్మా కాలనీ, రెల్లివీధి, స్కావెంజర్ల వీధి, మేదర వీధి, గాడు వీధి, ఎల్లమ్మ మెట్ట, తోటవీధి, కృష్ణా కాలనీలో ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ ప్రాంత టీడీపీ కార్యకర్తలు జడ్సీ కనకమహాలక్ష్మి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా వీధుల్లో కాలువలు పాడయ్యాయని, కొత్తగా డ్రైనేజీలు నిర్మించడం లేదని, తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలగడుగుల మురళి, కుప్పిలి గురుమూర్తి, గరక శ్రీను, గూడుపు రాజు, కర్రి శివ, పిల్లా తాతారావు, చెన్నా రాము, పొడుగు తిరుమలరావు, బంగారి గణేష్, ధనాల శ్రీను, చెన్నా లక్ష్మణరావు పాల్గొన్నారు. అలాగే ఊళ్లపేట, గొల్లలపాలెం, సుఖీభవ లేఅవుట్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు విన్నవించారు. కాగా మొత్తం తొమ్మిది అర్జీలు అందగా ఇంజినీరింగ్ విభాగానికి 7, రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చాయి. జడ్సీ వాటిని పరిశీలించి, ఆయా విభాగాధిపతులకు అందజేసి, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఏసీపీ శ్రీనివాసరావు, ఏఈ సుమన్ పాల్గొన్నారు.



జడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ కార్యకర్తలు

వేద పురుషావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం, జూలై 8 : పట్టణంలోని ఇంద్రద్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు వేద పురుషావతారంలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారికి ఆలయ అర్చకుడు రొంపిచర్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారి వేద పురుషావతార విశిష్టతపై సింగరాచార్యస్వామి భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన



పార్కును సందర్శిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర

పెదవాల్తేరు, జూలై 8 : వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవీంద్ర సోమవారం బీచ్ రోడ్డులోని వుడా పార్కును సందర్శించారు. పార్కులో పారిశుధ్యం, తాగునీటి సరఫరా విషయంలో అలసత్వం వహించవద్దని అధికారులకు సూచించారు. అలాగే కుక్కల బెడద తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు సీఈఓ భవానీశంకర్, ఎస్ఈ బాలరామరాజు, ఈఈ రాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, డీఈ మురళీకృష్ణ ఉన్నారు.

మద్దిలపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ

మద్దిలపాలెం, జూలై 8 : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో జీవీఎంసీ అధికారులు సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు వీధుల్లో ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని చెత్త లేకుండా చూడాలన్నారు.

రోగికి మత్తు ఇవ్వడంలో కొత్త పద్ధతులు

కొమ్మాది, జూలై 8 : రోగికి మత్తు మందు ఇవ్వడంలో కొత్త పద్ధతులు వచ్చాయని డాక్టర్ కల్లేపల్లి కూర్మనాథ్ అన్నారు. సోమవారం ఆయన గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రిలో మత్తు మందు వినియోగంలో రూపొందించిన కొత్త విధానంపై వైద్యులకు అవగాహన కల్పించారు.ఈ సదస్సుకు గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు ముఖ్య అతిథిగా హాజరు కాగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 100 మందికిపైగా మత్తు వైద్యులు హాజరై వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కూర్మనాథ్ మాట్లాడుతూ ఆపరేషన్ చేయించుకునే రోగికి కొత్త పద్ధతి ద్వారా మత్తు మందు ఇవ్వడం వల్ల తక్కువ సమయంలోనే రోగి మత్తు నుంచి కోలుకుంటారని, ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉండవని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల డీన్ సుబ్బారావు, డైరెక్టర్ వరప్రసాదు, డాక్టర్ రంగారావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సౌజన్య

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

భీమునిపట్నం, జూలై 8 : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని భీమిలి ఒకటో అదనపు కోర్టు మెజిస్ట్రేట్ డి. సౌజన్య అన్నారు. సోమవారం బీచ్‌రోడ్‌లో వున్న కోర్టు ఆవరణలో రోడ్డు ప్రమాదాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు గురైన కేసుల్లో ఎక్కువగా తలకు గాయం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగే సమయంలో ప్రాణాలకు రక్షణగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో లోవోల్టేజీ సమస్య



అస్తవ్యస్తంగా ఉన్న వైర్లు

పద్మనాభం, జూలై 8 : మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ రామన్నపేటలో ప్రజలు లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. కేవలం విద్యుత్ మోటార్లకు సరఫరా ఇవ్వడానికి వేసిన కేబుల్ వైర్లతోనే గృహావసరాలకు కూడా విద్యుత్ సరఫరా చేయడంతో సమస్యలు వస్తున్నాయి. ఈకేబుల్ వైర్లు కూడా చాలాకాలం క్రితం వేసినవి కావడంతో చాలాచోట్ల తెగిపోయి అతుకులతో ఉన్నాయి. గృహావసరాలకు విద్యుత్ సరఫరాకు కొత్త కండక్టరు వేయాల్సి ఉన్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో విద్యుత్ సరఫరాకు ఎప్పుడు ఆటంకం కలిగినా రోజుల తరబడి చీకట్లో మగ్గాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ముక్కుపిండి బిల్లులు వసూలు చేసే ఈపీడీసీఎస్ అధికారులు విద్యుత్ లైన్లను మెరుగుపరచడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోతున్నారు. లోవోల్టేజీతో మోటార్లు పనిచేయక పంటలు కూడా ఎండిపోతున్నాయి. అధికా రులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మత్తులో యువకుడి హల్‌చల్

వేపగుంట, జూలై 8: మద్యం మత్తులో ఓ యువకుడు నడిరోడ్డుపై హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన సింహాచలం గోశాల సమీపంలోని పద్మావతినగర్ వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. ఆరిలోవకు చెందిన లక్ష్మణ్ పూటుగా మద్యం సేవించి రోడ్డుపై నడిచి వెళ్తున్న వారిపై దాడి చేశాడు. దుర్భాషలాడుతూ చిందులు తొక్కాడు.దాదాపు గంటన్నర సమయం అటువైపు వెళ్లే వారిని ఇబ్బంది పెడుతుండడంతో స్థానికులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మణ్ కుటుంబసభ్యులను పిలిపించారు. అయితే వారితోనూ వాగ్వాదానికి దిగడంతో స్టేషన్‌కు తరలించారు.



సింహాచలంలో నివాళులు అర్పిస్తున్న అభిమానులు



భీమిలిలోని వైసీపీ కార్యాలయంలో వేడుకలు

ఘనంగా వైఎస్సార్ జయంతి

భీమునిపట్నం, జూలై 8 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో అన్నిచోట్లా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, తదితరులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, అల్లిపిల్లి నరసింగరావు, పాసి స్వర్ణలత, వాసుపల్లి కొండబాబు, బాకి రమణారెడ్డి, వాసుపల్లి ఎల్లాజీ, బూర నాగరాజు, వాడమొదల జగ్గారావు, కోండ్రు రామసూరప్పడు, చెల్లూరి గౌరినాయుడు, జగ్గపల్లి ప్రసాద్, బూర రామకృష్ణ, బాడితబోయిన రాములప్పడు పాల్గొన్నారు.

ఆరిలోవ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ పేదల మనిషి అని 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యన్నారాయణ అన్నారు. వైఎస్ జయంతి సందర్భంగా ఆమె ఆరిలోవ ఆఖరి బస్ స్టాపు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి కెల్ల సత్యన్నారాయణ, పిల్లి వీర్రాజు, బాబూరావు, లాయర్ గోవింద్, బేతా దుర్గారావు పాల్గొన్నారు.

సింహాచలం : వైఎస్ జయంతి పురస్కరించుకుని సింహాచలం ప్రధాన కూడలిలో ఆయన చిత్రపటానికి వైసీపీ నాయకులు పుష్పమాలికలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో 98వ వార్డు వైసీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడివివరం సహకార పరపతి సంఘం పాలకమండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరంబాబు, నాయకులు కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, మజ్జి వెంకట అప్పలరమణ, శ్రీనివాస్, రామరాజు పాల్గొన్నారు.



13వ వార్డులో వైఎస్ జయంతి వేడుకలు



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసిన 'తూర్పు' నాయకులు

వెంకోజీపాలెం, జూలై 8 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును తూర్పు నియోజకవర్గం నాయకులు సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కరమాని వెంకటరావు, పోలవరపు అప్పారావు, మన్యాల రమణ పాల్గొన్నారు.

రైతులకు సీజనల్ వ్యాధులపై అవగాహన



తడి, పొడి చెత్త సేకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎంవీపీ కాలనీ, జూలై 8 : స్థానిక రైతు బజారులోని రైతులకు జీవీఎంసీ అధికారులు సోమవారం సీజనల్ వ్యాధులు, తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. జోన్ 3 సహాయ వైద్యారోగ్య అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు పారిశుధ్య కార్యదర్శి సూరిబాబు, రైతు బజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్, సహాయకుడు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం దుకాణాల ఏర్పాటు

ఎంవీపీ కాలనీ, జూలై 8 : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీలో ఉన్న స్పోర్ట్స్ ఎరీనా వద్ద రోడ్డుకి ఇరువైపులా పదుల సంఖ్యలో వీధి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో కొన్ని ప్రతిరోజూ తెరిస్తే, మరికొన్ని ఒక్కరోజు కూడా తెరిచిన దాఖలాలు లేవు. అలాగే అప్పుడప్పుడూ ఓ కొత్త దుకాణం వెలుస్తుంటుంది. కొత్తగా వచ్చేవారితో పాత బడ్డీల యజమానులు గొడవ చేస్తుంటారు. కొద్ది రోజుల క్రితం ఇక్కడి వ్యాపారులు ఓ కమ్యూనిస్టు యూనియన్‌తో కలిసి అక్రమ దుకాణాలను తొలగించాలన్న డిమాండ్‌తో నిరసనకు సిద్ధమయ్యారు. కానీ ఎందుకనో మళ్లీ వాయిదా వేశారు. వాస్తవానికి ఇక్కడ దుకాణాల్లో ఒక్క దానికి కూడా జీవీఎంసీ అనుమతి లేదు. కరోనాకు ముందు కొందరు వ్యాపారం చేసుకునే వారు. తర్వాత ఎవరు ఎక్కడకు వెళ్లపోయారో గాని, కొత్త ముఖాలు వచ్చాయి. మరికొందరు తమ పాత బడ్డీని ఇక్కడే ఉంచి, మరోచోట వ్యాపారం చేసుకుంటున్నారు. ఇక కొత్తగా ఒకరిద్దరు రావడానికి ప్రయత్నిస్తున్నారు. వారికి టీడీపీ, వైసీపీ నాయకుల మద్దతు ఉందన్న ప్రచారం ఉంది. ఈ విషయమై జీవీఎంసీ అధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

15న పద్మనాభం మండల సమావేశం

పద్మనాభం, జూలై 8 : పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి. శైలజ తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ కె. రాంబాబు అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని ఆమె కోరారు.

మేలైన పశుగ్రాసాలతో అధిక పాల దిగుబడి



కోరాడలో పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పిస్తున్న డీడీ మురళీకృష్ణ

పద్మనాభం, జూలై 8 : పశువులకు మేలైన పశుగ్రాసం వేయడం ద్వారా అధిక పాల దిగుబడి సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. మురళీకృష్ణ అన్నారు. సోమవారం ఆయన కోరాడ రైతు సేవా కేంద్రంలో రైతులకు పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు గ్రాసాల్లో రకాలైన ఏకవార్షికాలులోని జొన్నలు, మొక్కజొన్న, బొబ్బర్లు బహువార్షికాలలో పారాగడ్డి, గినిగడ్డి, సూపర్ నేపియర్, పచ్చగడ్డి తదితర గ్రాసాలను పశువులకు వేయడం వల్ల అవి ఆరోగ్యంగా ఉండడమే కాకుండా పాల దిగుబడి కూడా ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి పశువైద్యాధికారి ఆర్. శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంటు సుజాత తదితరులు పాల్గొన్నారు.

శొంఠ్యాంలో పశుగ్రాస వారోత్సవాలు

ఆనందపురం, జూలై 8 : మండలంలోని శొంఠ్యాం గ్రామంలో పశు సంవర్ధక శాఖాధికారులు సోమవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులకు పశుగ్రాసాల పెంపకంపై అవగాహన కల్పించారు. పశుగ్రాసం రకాలు, వాటి వినియోగం వల్ల వచ్చే లాభాల గురించి వివరించారు. పశుగ్రాసం పెంపకం వల్ల రైతులకు అయ్యే అదనపు మేత ఖర్చు తగ్గుతుందని, పాల దిగుబడి పెరుగుతుందన్నారు. పశుగ్రాసం విత్తనాలు 75 శాతం రాయితీపై అందిం చడానికి సిద్ధంగా ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి కన్నయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు అర్హులకే చెందాలి'

భీమునిపట్నం, జూలై 8 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకే చెందాలని బీఎస్‌పీ నాయకుడు, మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు భాగం గోపాలరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పును కూటమి చేయకూడదన్నారు. ముఖ్యంగా తెల్లరేషన్ కార్డులు లక్షల కొద్దీ అనర్హుల చేతిలో ఉన్నాయని, వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తే ప్రజా ధనం దుర్వినియోగమైనట్టేనని చెప్పారు. ఈవిషయమై ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు.కాగా భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆనుకుని వున్న బిల్లలమెట్ట సర్వే నంబరు 167లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాదంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లపై దర్యాప్తు జరపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఎస్ఆర్‌లో వినతిపత్రం అందించారు.